57389
ENTERED
Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



మార్పుకోరే మహిళకు పాఠ్యపుస్తకం

ఎస్. పుణ్యవతి, సి.పి.ఎం. కేంద్ర కమిటీ సభ్యురాలు

స్నేహ

జనవరి 10, 2010

ఊరూరా సంక్రాంతి

హ్యాపీ బర్త్‌డే

(2010 జనవరి 10 నుంచి
2010 జనవరి 16 వరకు)

సి. సంధ్య
7సం॥,జనవరి-2003
జయలక్ష్మి-తమ్మయ్య
శ్రీకాకుళం

బృహద్ధ్వని
జనవరి-11
సుధారాణి-కవీశ్వరాచారి
సంజయ్‌నగర్-ఆదిలాబాద్

మనోజ్ఞసాయి
1సం॥,జనవరి-15
నళిని-నాగేశ్వరరావు
కాకినాడ

ఎం. ఆదిత్య
2సం॥,జనవరి-16
సరిత-వెంకటస్వామి
తాండూర్-ఆదిలాబాద్

ఐజక్ జెస్విన్
జనవరి
ఎస్తేర్-పీటర్
జియాగూడ-హైదరాబాద్

వి. లీలా నాగలహరి
జనవరి-13
మీనాకుమారి-శ్రీనివాసరావు
అమరావతి-గుంటూరు

పి. నాగజ్యోతీశ్వరి
8సం॥, జనవరి-2002
పద్మ-బుజ్జిబాబు
కృష్ణలంక-విజయవాడ

కె. సాహితిప్రేమ
1సం॥, జనవరి-2009
అనిత-ఎల్లయ్య
వలిగొండ-నల్లగొండ

పి. సంజీవని
2సం॥,జనవరి-12
సాయిమల్లిక-రాజేష్

పి.శివచరణ్
1సం, జనవరి-2009
నీలమ్మ-రాజయ్యగౌడ్
ముషీరాబాద్-హైదరాబాద్

యు. సాత్విక్
జనవరి
సమత-సురేష్
సంగిడి-ఆదిలాబాద్

ENTERED

మనలో మాట

ముందస్తు సమాధుల రివర్స్ అమ్మకాలు

పంటలు రాకముందే వాటిపై వ్యాపారం చేసేసి ధరలు పెంచేస్తున్నారిప్పుడు. ఈ దుర్మార్గానికి ఫార్వర్డ్ ట్రేడింగ్ అని ముద్దు పేరు పెట్టుకున్నారు. ఇలాంటి పద్ధతులకు పెట్టింది పేరు అమెరికా. లాభం కోసం అక్కడి పాలకులు ఏమైనా చేస్తారు. లాభాలే పరమావధి అయినచోట ఏదీ స్థిరంగా వుండదు. ధరలైతే మరీను. అందుకే అమెరికాలో సమాధులు కూడా ముందే డబ్బు చెల్లించి బుక్ చేసుకుంటారు. చచ్చాకయినా ప్రశాంతంగా వుందామని అక్కడివారి అభిలాష. అమెరికాలో వర్షం పడితే ఇక్కడ మనకు తుమ్ములొచ్చే కాలమొచ్చింది. అక్కడిలా సమాధుల్ని అడ్వాన్సుగా బుక్ చేయకపోయినా పోటాపోటీలో మనమూ తక్కువ తినలేదు. పెళ్లి ముహూర్తానికి ఏడాది వుందనగానే హాల్ బుకింగ్, కడుపులో నలుసు పడకముందే స్కూల్లో సీటు బుకింగ్, రాయితీ కోసం నెలలు ముందుగానే హోటల్ గదుల బుకింగ్, విమానంలో సీట్ల బుకింగ్, నేరం నెత్తిన బడుతుందనుకుంటే కోర్టులో ముందస్తు బెయిల్ వగైరా వగైరా అన్నమాట.

ప్రపంచానికి 'ఆర్థిక సంక్షోభాన్ని' బహూకరించిన ఘనత దక్కించుకున్న అమెరికాలో నేడు పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడక్కడ తినడానికి తిండి కరువు. చేయడానికి పని కరువు. ఉద్యోగాలు ఊడి కొందరు. లేక కొందరు. ఉన్న గూడు ఎప్పుడు చేజారుతుందో తెలీక మరికొందరు. బతకడం ఎలా... అసలే దేనికీ గ్యారంటీ లేని దేశం. కనుక జనం తమ దగ్గర వున్న విలువైన వస్తువుల జాబితా రూపొందించి ఒక్కొక్కటే అమ్ముకుంటున్నారు. ఈ జాబితాలో ఎక్కువమంది మొదటి స్థానంలో వుంచినవేంటో తెలుసా! ముందస్తు సమాధులు. చావు సంగతి తర్వాత చూసుకోవచ్చు. చావొచ్చేదాకానైనా బతకాలి కదా! మరి బతకాలంటే... ఏదో ఒకటి అమ్ముకోక తప్పదు. అందుకని 'భలే చవక బేరము. ఆలసించిన ఆశాభంగము' అంటూ ఇంటర్నెట్లు, పత్రికల నిండా తాము బుక్ చేసుకున్న సమాధి స్థలాలను కొనుక్కొమ్మని ప్రకటనలు గుప్పిస్తున్నారు. కొందరైతే చావు తర్వాత ఖర్చు భరించలేమని తెల్సి తమ శరీరాలను సైన్స్ పరిశోధనల నిమిత్తం దానం చేసేస్తున్నారు. పాపం సమాధుల ఫార్వర్డ్ ట్రేడింగ్ అమెరికాలో రివర్స్‌లో పడిందన్నమాట.

ఆర్థిక సంక్షోభం ఫలితంగా చావుకూ చావొచ్చిపడింది మరి! ★

ఈ సంచికలో....

టపా	...	2
సినిమా కబుర్లు	...	3
కవిత్వమ్	...	6
రుచి	...	7
కథ	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
ఏ గురకలో ఏ పరమార్థముందో		17
క్రైమ్ కథ	...	20
వికాసం	...	21
చూద్దామా	...	22
విజ్ఞాన వీచిక	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

మార్పుకోరే మహిళకు పాఠ్యపుస్తకం

గాలిపటమా... పద... పద... ... 10

తెలుసుకుందామా... 18

రేగు భళా!



వింతే!

డిసెంబర్ 20వతేదీ సంచికలో 'స్వప్నంలో చిరునవ్వు' కవిత చాలా బాగుంది. పేదల వ్యధలకు అక్షర రూపాన్నిచ్చిన విధానం, కవిత ప్రస్తుత సమస్య చుట్టూ తిరగడం బాగుంది. 'లంక ఆరాధ్యుడు రావణుడు' చదువుతుంటే చాలా ఆసక్తిగా వుంది. మన దేశంలో శ్రీరాముడిని ఆరాధ్యదైవంగా కొలిచినట్టే, శ్రీలంకలో రావణుడిని పూజించడాన్ని తెలుసుకుంటే వింతగా అనిపిస్తుంది. క్రైమ్‌కథలు ఆసక్తికరంగా వుంటున్నాయి. ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్న ఈ సంచిక ఆదివారానికే హైలెట్.

జి.లక్ష్మణరావు, శ్రీకాకుళం. పెద్ది పవన్‌కుమార్, సిద్ధిపేట, మెదక్. కె. శ్రీధర్, కరీంనగర్.

భూమిని చల్లబరుద్దాం

అంజనగారు అందించిన అట్టమీది కథ హృద్యంగా వుంది. ఏ కాలం ఎలా వున్నా ఆశావహ దృక్పథంతో జీవించటమే ప్రధానమన్నది అందరం గుర్తిద్దాం. 'ప్రమాదంలో ఆ పది' చదివి చలించిపోయాం. కొత్త సంవత్సరం నుండైనా గ్లోబల్ వార్మింగ్‌కు శాశ్వత పరిష్కారం కోసం కృషి జరగాలని ఆశిద్దాం. 'తెల్సా' చదివిన రమణులంతా బిడ్డకు పాలిస్తే ఇరువురికీ మేలన్నది గ్రహించివుంటారు. చూద్దామాలో ఈజిప్టు విశేషాలన్నీ ప్రత్యక్ష సందర్శనానుభూతిని కలిగింపజేశాయి. డా॥డి. ఆర్కే. ప్రసాద్ గారి 'వికాసం' పెద్దలందరూ చదివి, అవగాహన చేసుకుంటే బావుంటుంది.

– నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

వివరంగా తెలుసుకున్నాం

కవర్ స్టోరీ '2010 ముంగిట్లో' బావుంది. ఇందులో పేర్కొన్నట్లే 2009 ఎన్నో చేదు అనుభవాలను మూటగట్టుకుంది. 2009 జనవరి 1న సమయానికి నిద్రలేవాలని, అందరితో కలుపుగోలుగా ఉండి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నా అవి ఏమేరకు అమలు అయ్యాయో మనం నెమరవేసుకోవాలి.

కామిడి సతీష్ రెడ్డి, పరకాల, వరంగల్.

ఆజాద్ గుర్తొచ్చాడు

జీవితానికి మార్మిజానికి గొప్ప అర్థం చెప్పారు పొట్లూరి వెంకటేశ్వరరావుగారు. ఇది చదువుతున్నంతసేపు చంద్ర శేఖర్ ఆజాద్ గుర్తుకువచ్చాడు. ఈ తరం వారికి ఆర్థిక బాధలు ఎన్ని ఉన్నా పెద్దలను వదులుకోవద్దని కళావతిగారు చెప్పారు. అట్టడుగు నుండి ఉన్నత స్థాయికి రావాలంటే ఎంత కష్ట పడాలో సావిత్రి జీవితం నేర్పుతుంది. ఆర్థికంగా ఎదిగిన తరువాత ఎలా ఉండకూడదో కూడా తెలుపుతుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమనవారిపేట, విజయవాడ.

ప్రతి ఒక్కరూ చదవవలసిందే!

'2010 ముంగిట్లో' ప్రతి ఒక్కరూ చదవవలసిందే. కాలం, కెరటం ఎవరి కోసం ఆగవు. రోమన్ చక్రవర్తుల పేర్లతో జులై – ఆగస్టు వంటి నెలలతో వున్న క్యాలండరే నేటికీ చలామణిలో వుంది. ఈ కాలం క్యాలెండర్ విషయాలు అందరూ చదవదగినవే. పిల్లలకు విజ్ఞానం కలిగిస్తోంది.

– ఆచార్య నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

'...ముంగిట్లో' వినూత్నంగా

ఓ మధ్యతరగతి గృహిణి ఆత్మీయంగా చేసిన సంభాషణ రూపంలో నడచిన అట్టమీది కథ '2010 ముంగిట్లో' మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఎన్నో విశేషాలు వినూత్నమైన శైలిలో అందించడం ఎంతో బాగుంది. ఆధునిక నాగరికత, ఉరుకుల పరుగుల జీవన విధానం మానవసంబంధాలను ఎలా ఛిద్రం చేస్తుందో చక్కగా వివరించింది ఈవారం కథ 'ప్రియమైన అమ్మాయికి'. సంవత్సరంలో విజ్ఞానశాస్త్రంలో జరిగిన విశేషాల సంక్షిప్త సమాహారం '2009 విజ్ఞాన విహంగం' ఆసక్తికరంగా చదివించింది.

–ఆర్. డబ్ల్యూ.జె. విజయకుమార్, ఏలేశ్వరం.

వికాసం బావుంది

భూమికి హామీ అంటూ వెంకట్రావుగారి రచన ద్వారా 'గ్రీన్ హౌస్ ఎఫెక్ట్', గ్రీన్‌హౌస్ వాయువులు' వంటి వాటి గురించి సదవగాహన కలిగింపచేశారు. చూద్దామాలోని శ్రీలంక పరిసర ప్రదేశాల విశేషాలు ఎంతో చక్కని అనుభూతిని కలిగింప చేశాయి. వికాసం ద్వారా డి.ఆర్కే ప్రసాద్ గారు రాసింది చదివాక చదువుకోసం అపురూపమైనవి వదులుకోవాల్సిరావడం బాధాకరమేననిపించింది. "ముదురు" ఛాయాచిత్ర సంభాషణలు గమ్మత్తుగా వున్నాయి.

ఎన్. సుభాష్, శ్రీకాకుళం.

మంచి పంచ్

డిసెంబర్ 20 నాటి స్నేహలో 'స్వప్నంలో చిరునవ్వు' కవిత అందరికీ మంచి పంచ్ నిచ్చిందని భావిస్తున్నాను. భూమికి హామీ చదివిన తర్వాత భూమ్మీద మాత్రమే జీవులున్నాయని, 200కిలోమీటర్ల ఎత్తుండే ఈ వాతావరణం పొరలో మాత్రమే మానవుడు నివసిస్తున్నాడని, కోపెన్‌హెగెన్ సదస్సు గురించి, గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ గురించి చాలా వివరాలు తెలిపారు.

సిరి చందన, కామిడి సతీష్, వరంగల్.

స్ఫూర్తినిచ్చే జీవితం

టి.సి. లక్ష్మమ్మగారి జీవితమే ఒక స్ఫూర్తినిచ్చేదిగా వుంది. 80 సంవత్సరాల వయస్సులో ఐద్వాలో పని చేయడం ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చే జీవితమది. తాను పార్టీలో పని చేస్తూనే తన కొడుకును పార్టీ పత్రికలో పనిచేయడం కోసం పంపడం తల్లులకు స్ఫూర్తిచ్చేదిగా అయింది. పార్టీలో అతివాద – మితవాద పోకడలు వచ్చినా, ఆమెకు రాజకీయ చైతన్యం వున్నందువల్ల తాను గౌరవించే వ్యక్తులు అటూ ఇటూ వెళ్లిపోయినా తాను మాత్రం మార్కిస్టు పార్టీలోనే వుండిపోవడం అభినందనీయం.

ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమనవారిపేట, విజయవాడ. ★

వెండి తెర సంక్రాంతి వేయి వన్నెలు

సంక్రాంతి తెలుగు సినిమా రంగానికి చాలా చాలా ప్రత్యేకమైన పండుగ. ఏదో ఒక సందర్భం చూసుకుని సంక్రాంతి దృశ్యాలూ పాటలూ జొప్పిస్తుంటారు. ముగ్గులూ గొబ్బెమ్మలతో ఈ పండుగ బాగా కలర్‌ఫుల్‌గా వుండటం తప్ప ఇందుకు మరో కారణం లేదు. ఎందుకంటే సంక్రాంతి అంటేనే అందమైన పల్లెపట్టుల్లో కోయిల కూతలూ, మామిడి పూతలూ, చెరకు గడలూ, బృందగానాలూ, సరస రాగాలూ, మెరిసే వేయి వన్నెల వెండి తెర పండుగ సంక్రాంతి.



సంక్రాంతి పేరుతో వచ్చిన సినిమాలూ మూడు నాలుగుంటాయి. టైటిల్ సంగతి పక్కన బెట్టి సంక్రాంతి ఘట్టాల విషయానికి వస్తే కె.విశ్వనాథ్ రెండవ చిత్రంగా తీసిన 'ఉండమ్మా బొట్టు పెడతా' ఇందుకు కేరాఫ్ అడ్రస్‌లా నిల్చిపోయింది. పండుగ రోజు ఉదయం నుంచి ఆ సినిమాలోని పాటనే మార్మోగుతుంది. అదే–

"రావమ్మా మహాలక్ష్మి రావమ్మా
నీ కోవెల ఈ ఇల్లు కొలువై వుండువు గాని.. అంటూ సాగే హరిదాసు పాట.

కడివెడు నీళ్ల కలాపి చల్లి
గొబ్బిళ్లో గొబ్బిళ్ల
చారెడు పసుపు గడపకు రాసి
గొబ్బిళ్లో గొబ్బిళ్ల......

పాలిచ్చే గోవులకు పసుపూ కుంకం పని చేసే బసవడికి పత్రి పుష్పం గాదెల్లో ధాన్యం లోగిళ్ల లాస్యం" అంటూ సంక్రాంతి శోభను కళ్లకు కడుతుంది. శకునిగా ప్రసిద్ధుడైన ధూళిపాల, జమున కలిసి అభినయించిన ఈ పాట అప్పటికింకా అంతగా విచ్చుకోని ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కంఠ మాధుర్యాన్ని మనకు అందిస్తుంది.

సంక్రాంతి పండుగ లేకపోయినా బాపు తీసిన 'ముత్యాల ముగ్గు' చిత్రం కూడా 'ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ' అంటూ ముగ్గు చుట్టూనే తిరుగుతుంది. శ్రీదేవి నాయికగా పేరు తెచ్చుకున్న మొదటి చిత్రం 'పదహారేళ్ల వయసు'లో కూడా సంక్రాంతి పాట సందడిగా సాగుతుంది.

హీరో కృష్ణ పల్లెటూరి చిత్రాలు తీయడంలో అందెవేసిన చేయి. రాయలసీమ ఫ్యాక్షన్ కథలు ఇంకా వ్యాప్తిలోకి రాకముందే ఆయన భోగి మంటలు పేరిట ఈ తరహా చిత్రం తీశారు. పేరులోనే సంక్రాంతి ఛాయలు కలిగిన ఈ చిత్రంలో నాయిక రతి. నాయికా నాయకులతో పాటు నూతన్ ప్రసాద్ కూడా పాల్గొనేలా 'హరిలోరంగ హరి' పాట ఒకటి వుంటుంది. కథ కూడా పండుగతో మొదలై కక్షల మంటలు ఎగయడంతో ముగుస్తుంది.

దాసరి నారాయణరావు దర్శకత్వం జోరుగా సాగుతున్న రోజుల్లో అక్కినేని, కృష్ణ ఇద్దరూ నాయకులుగా జయసుధ తదితరులతో 80లలో తీసిన చిత్రం 'ఊరంతా సంక్రాంతి'.

"సంబరాల సంక్రాంతి
వూరంత పిలిచింది
ఏడాదికో పండుగ
ఊరంత కనువిందుగా" అంటూ రెండు జంటలతో సహ బృందగానాలతో సందడిగా నడుస్తుంది. షరామామూలుగా అన్నదమ్ముల విభేదాల ఇతివృత్తం కలిగిన ఈ చిత్రం పెద్దగా విజయం సాధించలేకపోయింది. సంక్రాంతికి సంకేతం గంగిరెద్దులూ, హరిదాసులూ గనక వీరిని ప్రధానంగా పెట్టుకుని తీసిన కథలనూ ఈ జాబితాలో చూడొచ్చు. చలం తీసిన 'డూడూ బసవన్న' అలాటి వాటిలో ఒకటి. విశ్వనాథ్ రూపొందించిన 'సూత్రధారులు' చిత్రంలో అక్కినేని, మురళీమోహన్ హరిదాసులుగా కీలకపాత్రలు పోషిస్తారు. విశ్వనాథ్, బాపు వంటి వారి చిత్రాల్లోనూ, పల్లెటూళ్ల ప్రధానంగా తీసిన చిత్రాల్లోనూ మనకు సంక్రాంతి సంబరాలు కనిపిస్తాయి. క్రమేణా గ్రామీణ కథా చిత్రాలు తగ్గిన కొద్ది ఇవి కూడా తగ్గు ముఖం పట్టాయి.

అయితే ఈ దశాబ్దంలో వెంకటేశ్ కథానాయకుడుగా వచ్చిన 'సంక్రాంతి' ఆ లోటు కొంత తీర్చింది. ఉమ్మడి కుంటుంబం కథతో వచ్చిన ఈ సినిమాలో పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత లేకపోయినా కేవలం టైటిల్ కోసం దాన్ని ఎంచుకున్నారు. ఇంటిల్లి పాది మంచిగా వుండే కథ చిన్న చిన్న మలుపులతో నడుస్తుంది. చాలా తమాషాగా ఈ కథలో దొంగతనానికి వచ్చిన అతనికి కూడా అన్నం పెట్టి కుటుంబ సభ్యుడుగా చేసుకుంటారు. ఎవరికి వారు సమస్య ఇతరులకు తెలియకూడదని కోరుకుంటారు. ఫార్ములా ప్రకారం ఏదో అడ్డం తిరుగుతుందని వూహించే ప్రేక్షకుల అంచనాలు తలకిందులవుతుంటాయి. పేరుకు తగినట్టే ఈ చిత్రం పండుగ శోభతో సుఖాంతమవుతుంది.

ఇప్పుడు మన చిత్రాల్లో పల్లెటూరి కథలే చాలా తక్కువ. అన్నీ పట్టణ ప్రేక్షకులను దృష్టిలో వుంచుకుని తయారవుతున్నాయి. కనక ఇంతకు ముందులా ఆ వాతావరణం వుంటుందని ఆశించడం కష్టం. కాని పట్టణ వాసులు సెలవులకు వెళ్లడం, పల్లెల సౌందర్య స్పర్శకు పరవశించి పాటపాడటం వంటి సన్నివేశాలు కల్పిస్తుంటారు. ఈ మాత్రమైనా గత సంక్రాంతి ఛాయలు కొనసాగడం సంతోషమే కదా?

- పీపీ

స్ఫూర్తి

-ఎస్.పుణ్యవతి,
సిపిఐఎం కేంద్రకమిటీ సభ్యురాలు.

మార్పు కోరే మహిళకు పాఠ్యపుస్తకం

నావ మీద తన ముందు కూర్చున్న కామ్రేడ్లు అందుకు కారణం. తగులబడిపోతున్న నావలు, యుద్ధంలో బలైన బంధువులు, అనుభవించిన కష్టాలు, వాటన్నిటికీ ప్రతీకారం తీర్చుకోడానికి ఒక నవ సమాజ నిర్మాణానికి వెలుగుబాట చూపించే ఎర్రజెండా తమకు ధృతిని, త్యాగాన్ని, ఒక దివ్య సందేశాన్ని అందిస్తూ వుంది. అదే 'బానిసత్వ నిర్మూలన'. ఇదంతా ఎంత గొప్ప భావన. పార్టీ సభ్యత్వం పట్ల ఒక సాధారణ మహిళలో కలిగిన హృదయపు తడి. అదే నన్ను ఆకట్టుకుంది. "అమ్మ"లో నీలోవ్నా కూడా అలాగే స్పందిస్తుంది. 'దిటవుగుండెలు'లో నికొలాయ్ యుద్ధరంగంలో చనిపోతూ కూడా పార్టీ లెవీ కట్టడానికి తగిన ఏర్పాటు చేస్తాడు. అదే స్ఫూర్తి నేను 1977లో సభ్యత్వం తీసుకున్నప్పుడు కలిగింది. పార్టీలో వివిధ పదవులకు ఎన్నికయిన క్షణాలకన్నా పార్టీ ప్రమాణ పత్రంపై సంతకం చేసిన క్షణాలే గొప్పవి.

చిన్నతనంలో చందమామ పుస్తకాలు చదివేదాన్ని. అందులో పరోపకారి పాపయ్య కథలు, భేతాళ కథలు... ఆసక్తిగా వుండేవి. భారత రామాయణాలు, శివపురాణాలు చదివేదాన్ని. తర్వాత్తర్వాత ప్రభలు, పత్రికలు తిరగేస్తుండేదాన్ని. మాంటిస్సోరిలో డిగ్రీ చదివేప్పుడు నాన్నగారి స్నేహితులొకరు వాళ్లమ్మాయిని కూడా మా కాలేజీలో చేర్చారు. ఆయన మా ఇద్దర్నీ కూర్చోబెట్టి 'మంచి రష్యన్ సాహిత్యం వుంది చదవండి' అంటూ 'అమ్మ' నవలను పరిచయం చేశారు. నా జీవితంమీద ఆ పుస్తక ప్రభావం ఎంతైనా వుంది. ఆ తర్వాత నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం 'వియత్నాం గెరిల్లా' అని చెప్పుకోవాలి. డిగ్రీ ఫైనలియర్‌లో వుండగా ఎస్ఎఫ్ఐలో చేరా. డిగ్రీ పరీక్షలయ్యాక విశాఖ పెళ్లాను. అక్కడ కార్మికోద్యమం వుందని, లా చదవాలని, ఎస్ఎఫ్ఐలో పనిచేయాలని నాయకులు చెప్తే వెళ్లాను. 'దిటవు గుండెలు', అమీర్‌హైదర్‌ఖాన్ 'దేశం పిలిచింది', 'ఆదివాసీ తిరుగుబాటు' చదివా. అప్పటికింకా నేను పూర్తికాలం కార్యకర్తను కాలేదు. నా పనికి 'మహామనిషి హోచిమన్' ఎంతగానో ఉపయోగపడింది. ఇది హో సహచరులు రాసిన జ్ఞాపకాల సంకలనం. వియత్నాం విప్లవం అంటే పిచ్చి అభిమానం కల్గించిన పుస్తకమది. చుట్టూ సమాజంలో ఆస్తులు, అంతస్తులు, పెళ్లిళ్ళు, పేరంటాలు, సరదాలు, వ్యక్తిగత, బంధువుల ఊరి జీవితమే కాక ప్రపంచంలో ఇంకా చాలా వుంది. చూసి నేర్చుకోవాల్సింది, ఆచరించాల్సింది ఎంతో వుంది అని చెప్పాయి పుస్తకాలు. ఒక్కమాటలో చెప్పాలంటే నాకు దిశానిర్దేశం చేసిన పుస్తకాలివి.

అంతకుముందు వరకు తెల్సిన ప్రపంచం వేరు. బీరువాల నిండా బట్టలు, స్టీలు సామాన్లు నింపడం, పెళ్లిళ్ళు-పేరంటాలకు వాటిని బయటకు తీయడం, తిరిగి వాటిని శుభ్రంచేసి భద్రపరచడం. పెళ్లింటికి వెళ్లిన వస్తువు ఒకటి చేరకపోయినా దానిగురించే పదేపదే ఆలోచించడం. అంతా ఇలాగే వుండేది. 'మగవాళ్ల ఇల్లు బయటి ప్రపంచమయితే ఆడవాళ్ల ప్రపంచం ఇంటి నాలుగు గదుల లోపలే' అన్న జస్టిస్ చిన్నపరెడ్డిగారి మాట అక్షరసత్యమనిపించేది. అయితే సూర్యావతి, భిక్షవతి గారి ఇళ్లు అందుకు భిన్నంగా కనిపించేవి. ఇక్కడ అలాంటివేం వుండేవి కావు. బీరువాల నిండా పుస్తకాలుండేవి. 'అమ్మ, దిటవు గుండెలు, వియత్నాం గెరిల్లా' వంటి పుస్తకాలను అక్కడే తీసుకొని చదివా. వాటి మూలంగానే అనుకుంటా...మన వూరు, మన ప్రాంతం, మన బంధుమిత్రులే కాకుండా విశాల దృక్పథంతో కార్మికవర్గం దగ్గరకెళ్లి పనిచేయాలన్న పట్టుదల కలిగింది. 'అమ్మ'లోని నీలోవ్నా పాత్ర నామీద వేసిన ప్రభావం అంతా ఇంతా కాదు. ఆ పుస్తకం చదివాక కార్మికవాడలో కార్మికుల జీవితాలెలా వుంటాయో తెలిశాయి. ఎమర్జెన్సీ రోజులు, నాయకులు అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే సందర్భాలు చూసినప్పుడు విన్నప్పుడు 'నవలల్లో ప్రస్తావించిన వాతావరణంలోకి నేను కూడా ప్రవేశిస్తున్నాను' అన్న భావన కలిగేది. అలాగే మనకు తెలియని, పరిచయం లేని ప్రదేశాలలో పనిచేయడానికి ఆ పుస్తకాలు స్ఫూర్తినిచ్చాయి. దాదాపు ఇరవయ్యేళ్లపాటు అలవర్చుకున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్చుకోవడానికి, ఏ ప్రాంతానికి వెళితే ఆ ప్రాంతపు అలవాట్లను అలవర్చుకోవడానికి, జనంతో కలగలిసి పోవడానికి ఆ పుస్తకాలు ఉపయోగపడ్డాయి.

'వియత్నాం గెరిల్లా' విషయానికొద్దాం. దశాబ్దాల తరబడి ఫ్రెంచి, జపాన్, అమెరికా సామ్రాజ్యవాదులు ఆ దేశాన్ని కొల్లగొట్టి ఛిద్రం చేశారు. వీరి అరాచకానికి గురికాని వియత్నామీ కుటుంబం ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తికాదు. అలాంటి దక్షిణ వియత్నాం దేశంలో సముద్రపు ఒడ్డున నివాసముండే అనాథ మహిళ హావ్ ఒక విప్లవకారిణిగా ఏవిధంగా రూపాంతరం చెందిందో చెప్పే వీర గాథ 'వియత్నాం గెరిల్లా'. ఒక్కమాటలో చెప్పాలంటే సామాజిక మార్పుకోసం పనిచేసే ప్రతి మహిళకు పాఠ్య పుస్తకమిది. హావ్‌లో ఓ అనాథ, ఓ భార్య, ఓ ప్రేయసి, ఓ తల్లి, ఓ విప్లవకారిణి అగుపిస్తుంది. ఓవైపు అనునిత్యం బిడ్డలకోసం తపన పడుతూనే మరోవైపు లక్ష్యానికి లోటు రానీయకుండా కర్తవ్యదీక్ష కోసం సంఘర్షణ పడుతుంది. హావ్ తన తల్లీతండ్రీ చనిపోవడంతో అనాథగా మిగిలిపోతుంది. ఫ్రెంచి దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా పోరాడే గెరిల్లా ప్రేమలోపడి బిడ్డకు తల్లవుతుంది. ఆ పరిస్థితుల్లో అతను

యుద్ధరంగంలో వుంటాడు. ఇక్కడ ఈమె బిడ్డను సాకుతూ గెరిల్లాలకు తన వంతు సాయం చేస్తుంటుంది. మామ ఆమెకు తోడుగా వుంటాడు. ఆ సమయంలో ఫ్రెంచి దుర్మార్గుల చేతిలో అవమానాలకు, అత్యాచారానికి గురై మానసిక క్షోభకు గురవుతుంది. నవలలోని ప్రతి అక్షరంలో కర్తవ్యదీక్షలో తలమునకలైన స్త్రీమూర్తి హృదయం మనకు కనిపిస్తుంది. దేశ స్వాతంత్ర్యం కోసం మాతృభూమి పరిరక్షణకోసం పోరాటంలో మునిగితేలుతున్న గెరిల్లా స్త్రీ మనసు అగుపడుతుంది. ఫ్రెంచి ముష్కరులు చేసిన అవమానం నుంచి బయటపడేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా ఎంతో ఉద్వేగానికి, సంఘర్షణకు లోనవుతుంది. ఈ విషయంలో భర్త కూడా ఆమెకు ఎంతగానో సహకరిస్తాడు. ఆ ప్రస్తావనే తేకుండా ప్రేమ, ఆప్యాయతలు కురిపిస్తూ...ఆమె శరీరానికి, మనసుకు అయిన గాయాన్ని మాన్పడానికి శతవిధాలా ప్రయత్నిస్తాడు.

ఆమె ముఖాన్ని తన హృదయానికి హత్తుకుని "హావ్ బాగా పని చెయ్యి. బైని బాగా పెంచు. నీ కృషి మన ప్రజలకు, ఉద్యమానికి ఉపయోగపడుతుంది. శత్రువులలో ప్రచారం చెయ్యమని నీ స్నేహితులు అడిగితే అంగీకరించు....పాప చిన్నది. నేను దూరంగా వుంటాను. పాపను మంచిగా పెంచుతావని నా విశ్వాసం. పాపే మన ఆశాదీపం. ...భారమంతా నీదే..." అంటూ ఫ్రెంచి దురాక్రమణదారుల్ని పారదోలడానికి చేతనైనంత సాయం చేయమని ఉద్బోధ చేస్తాడు.

మహిళల్లో పనిచేయడానికి ఈ పుస్తకం ఒక మార్గదర్శిగా ఉపయోగపడింది. నవలలోని జిల్లా మహిళాసంఘ కార్యదర్శి 'దువాంగ్'ను చూసి చాలా నేర్చుకున్నాను. ఒక మహిళా నాయకురాలు ఎలా వుండాలనేది తెలుస్తుంది. హావ్ ఇంటికొచ్చినప్పుడు తనతో కలిసి రొయ్యలు వలుస్తూ మాట్లాడుతూ, ఆమెను మానసికంగా ఒక విప్లవకారిణిగా సన్నద్ధం చేసే తీరు కట్టిపడేస్తుంది. మహిళల్లో విప్లవాగ్నిని ఎలా రగుల్కొల్పాలి? వారిని కుటుంబంలోని సంకుచితత్వం నుంచి ఎలా బయటికి తీసుకురావాలి? ఎలా ప్రేరణనివ్వాలి? వంటి విషయాలు తెల్సుకోవడానికి ఈ చిన్ని పుస్తకం ఉపయోగపడింది.

బిడ్డలకు సంబంధించి తల్లి పడే తాపత్రయాన్ని అర్థం చేసుకుని జిల్లాపార్టీ తీసుకున్న నిర్ణయం చూస్తుంటే కార్యకర్తల పట్ల నాయకత్వం ఎంత జాగరూకతతో వ్యవహరిస్తుందో తెలుస్తుంది. పార్టీ తనకు అప్పచెప్పిన పనిని చేయడానికిగాను పిల్లలను టువాట్ అనే గృహిణికి అప్పగిస్తూ తన దగ్గరున్న కొద్దోగొప్పో చేతిలో పెడుతుంది హావ్. అప్పుడు ఆ గృహిణి "పిల్లల్ని పెంచగల స్తోమత వుంది. నేనెవరిననుకున్నావ్? ఆ విధంగా మాట్లాడుతున్నావ్? జీతానికి పెంచేదానిని కాను. ఉమ్మడి బాధ్యతలో నాకూ భాగముంది. నీవు చేసే పని నేను చేయలేను. అందుకని పిల్లల్ని నీ బదులు నేను పెంచాలి. అది నా బాధ్యత" అంటుంది. ఆ బాధ్యత నిర్వహణలో టువాట్ శత్రువు తుపాకి గుళ్లకి బలై చనిపోతుంది.

ఇలా ఏ బంధం లేని ఇద్దరు మహిళలు అప్పచెల్లెళ్ల కన్నా ఎక్కువ ప్రేమగా మెలగడానికిగాను వారిని ప్రేరేపించింది లక్ష్యమే. అదే నాకు స్ఫూర్తినిచ్చింది. పార్టీ ఒక ఉమ్మడి కుటుంబం అన్న భావన రావడానికి కామ్రేడ్ ఎన్‌పిఆర్, హనుమంతరావుగారు చూపించిన వాత్సల్యం, అభిమానంతో పాటు ఈ సాహిత్యం బాగా ఉపయోగపడింది. "కుటుంబ క్షేమమే కుటుంబ లక్ష్యం. కానీ ప్రజల క్షేమమే పార్టీ లక్ష్యం" అన్న స్ఫూర్తినిచ్చింది కూడా ఆ పుస్తకాలే.

అలాగే హావ్ పార్టీ సభ్యత్వం పుచ్చుకున్న క్షణాలు...అప్పుడామెలో కలిగిన భావాలు కూడా నన్ను ఎంతగానో ఉత్తేజపరిచాయి. నవలలో పేర్కొన్న ఆ వర్ణన నాకు ఇప్పటికీ గుర్తే. "ఆ సమయంలో హావ్ మనస్సు ఎలా వుందో వివరించడం చాలా కష్టం. తానొక మహత్కార్యానికి అంకితం చేయబడ్డాననే సంతోషం, ఉత్సాహం ఆమెను పెనవేసుకొంటాయి. తనను పార్టీ సభ్యురాలిగా తీసుకునే కార్యక్రమం ప్రత్యేక పద్ధతిలో జరుగుతుంది. తీర ప్రాంతంలోను, దాని చుట్టు పక్కల గ్రామాలలోను శత్రువు పెద్ద ఎత్తున బలగాలను సమీకరించి తెల్లవారుజామునే దాడి ప్రారంభిస్తాడు. సముద్ర గాలికి నావలో రెపరెపలాడుతున్న పార్టీ పతాకాన్ని చూడగానే ఆమె ముఖమంతా ఎర్రబారుతుంది. సజల నేత్రాలవుతాయి. అయితే అవి లోగడ మాదిరి కన్నీళ్లు కావు. గత సంవత్సరాలలో పడ్డ అవమానాన్ని, దు:ఖాన్ని ప్రతి కన్నీటి చుక్కా కడిగేసినట్టుగా వుంది. ఆ క్షణంలో ఆమె తన చుట్టూ వున్న కామ్రేడ్ల వంక తేరిపార చూస్తుంది. ప్రతి ఒక్కరూ ఆమె వంక ప్రేమతో చూస్తుంటారు. అప్పుడు ఆమె మనసులో ఓ ప్రశ్న ఉదయిస్తుంది. వీరంతా తన పట్ల ఇటువంటి ప్రేమ ఎందుకు చూపిస్తున్నారు? ఇదేమీ గారడీ కాదు. నావ మీద తన ముందు కూర్చున్న కామ్రేడ్లు అందుకు కారణం. తగులబడిపోతున్న నావలు, యుద్ధంలో బలైన బంధువులు, అనుభవించిన కష్టాలు, వాటన్నిటికీ ప్రతీకారం తీర్చుకోడానికి ఒక నవ సమాజ నిర్మాణానికి వెలుగుబాట చూపించే ఎర్రజెండా తమకు ధృతిని, త్యాగాన్ని, ఒక దివ్య సందేశాన్ని అందిస్తూ వుంది. అదే 'బానిసత్వ నిర్మూలన'. ఇదంతా ఎంత గొప్ప భావన. పార్టీ సభ్యత్వం పట్ల ఒక సాధారణ మహిళలో కలిగిన హృదయపు తడి. అదే నన్ను ఆకట్టుకుంది. "అమ్మ"లో నీలోవ్నా కూడా అలాగే స్పందిస్తుంది. 'దిటవుగుండెలు'లో నికొలాయ్ యుద్ధరంగంలో చనిపోతూ కూడా పార్టీ లెవీ కట్టడానికి తగిన ఏర్పాటు చేస్తాడు. అదే స్ఫూర్తి నేను 1977లో సభ్యత్వం తీసుకున్నప్పుడు కలిగింది. పార్టీలో వివిధ పదవులకు ఎన్నికయిన క్షణాలకన్నా పార్టీ ప్రమాణ పత్రంపై సంతకం చేసిన క్షణాలే గొప్పవి.

ఇదే కాదు! నవలలో పేర్కొన్న స్త్రీల వైవాహిక జీవితం కూడా ఆలోచింపచేస్తుంది. జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు ...ఎంత సేపున్నా నీ సంపాదన ఎంత? నా సంపాదన ఎంత? నువ్వు నీ వాళ్లకు ఎంత పెడతావ్? నేను నా వాళ్లకు ఎంత పెడతాను? అన్న అంశాలమీదే చర్చలు జరగడం మన చుట్టూ చూస్తుంటాం. కానీ ఈ నవలలో మాత్రం ఇరువురు వ్యక్తుల లక్ష్యమే వారి మధ్య ప్రేమ చిగురించడానికి, అది దినదినాభివృద్ధి చెంది వివాహం చేసుకోవడానికి ప్రధానాంశమవుతుంది. హావ్ తన సహచర విప్లవకారుడు జంగ్‌ని ఇష్టపడడానికి కూడా అదే కీలకాంశం. జంగ్ భార్యను కూడా అత్యాచారం చేసి ఆపైన ప్రాణాలనూ తీసేస్తారా దుర్మార్గులు. మానసికంగా జంగ్‌కు దగ్గరైన ప్రతి సందర్భంలోనూ తను ఎక్కడైనా తొందరపడుతున్నానేమో అనుకుంటుంది హావ్. ఎందుకంటే 'ఆమె భర్తను ఎంతగానో ప్రేమించింది' అనేదానికంటే 'ఆరాధించింది' అనడం సబబు. అందువల్లే జంగ్‌కు ఎక్కడ దగ్గరౌతానో అన్న మానసిక సంఘర్షణకు గురౌతుంది. చనిపోయిన భర్తకు అమరత్వం ప్రసాదించాలనే ధోరణిలోనే నేటి సమాజం వుంది. కానీ అమరవీరుని భార్య అమరవీరుని భార్యగానే మిగిలిపోనవసరంలేదు. రచయిత బుయ్‌డక్ ఆయ్ ఆనాడే ఈ సమస్యను సున్నితంగా అర్థంచేసుకుని మనందరి ముందు పెట్టిన తీరు, ఆశావహ ధోరణి ఆలోచింపచేస్తుంది.

"జంగ్ పట్ల ఆమె ప్రేమ సంగతేంటి? వేసవి సెలవులకు తిరిగి వస్తున్న పిల్లలిద్దరూ ఆమెను కలుసుకుంటారు. వాళ్లు సంతోషంగా వుంటారు. ఇకముందు ఆమె నిజమైన గొప్పజీవితం నవమార్గాన సాగిపోతుంది...." అనడంతో నవల ముగుస్తుంది. ఇది నేటి తరం నేర్చుకోవాలి. మళ్లీ తన జీవితాన్ని పునర్నిర్మించుకోవాలన్న ఆకాంక్షను రచయిత ఆనాడే వ్యక్తం చేస్తాడు.

తర్వాత మహిళా సంఘ కార్యకర్తలెందరికో చెప్పి ఈ పుస్తకం చదివించాను.

★

త్వరలో
'వియత్నాం గెరిల్లా'
సీరియల్

పై వారం నుంచి 'వియత్నాం గెరిల్లా' నవలను సీరియల్‌గా అందిస్తున్నామని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం. గతంలోవలె ఈ సీరియల్‌నూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

- ఎడిటర్.

కవిత్వమ్

ఎద తీరాన

- మహ్మద్ ఖాన్



కొన్ని వ్యాపకాలు నిదురపోనియ్యవు
కొన్ని రెక్కలు తెగిన
జ్ఞాపకాలయి ఎగరలేక
పరిగెత్తనూలేని, పక్షులయి వాలతాయి ఎదపై
కొన్ని బాధలు
మేల్కొంటేనే సహించనట్లు అల్లిమేటమిస్తాయి
కొన్ని గాయాలు
బాధల్ని రెచ్చగొట్టి తరచి జూచేందుకు
ఉవ్విళ్లూరుతూ ఉబలాటపడుతుంటాయి
కొన్ని వేదనలు
చెరిగిపోని జ్ఞాపకాలయి వేధిస్తుంటాయి
మనసును చిన్నాభిన్నం చేసేందుకు
ఎన్ని వ్యధలూ, బాధలూ కావాలి?
ఒకే ఒక్క పదునైన జ్ఞాపకం చాలదా?
బాధల్ని వ్యధల్ని సమాధి చేసి
నేను సరికొత్తగా జన్మించి పూదోటనవుతాను
పూదోటల్లోనూ చిలుకలే కాదు
కొండ చిలువలూ నక్కుకొని ఉంటాయి
కోయిల పాటలే కాదు
కొండ ముచ్చుల కిచకిచలూ భరాయించక తప్పదు
మనసును శృతి చేసే
మౌనరాగం కావాలిపుడు, సరికొత్త పల్లవిలో....

తలపుల తడిలో...

- వి. సూర్యారావు

చినుకయి పోవాలని వుంది
చినుక్కి చినుక్కి మధ్య
అడుగు అడుగు దూరంలో
మొక్కయి పోవాలని వుంది.
పారుతున్న చినుకు చుక్కల్లో పిల్ల కాలవల్లో
కాగితం పడవనయి బాల్యంలోకి
జారిపోవాలని వుంది.
అమ్మ తడవొద్దన్నా వర్షంలో
తడిచి తడిచి ముద్దయిపోయిన ఆ జ్ఞాపకాల్ని
మళ్లీ మళ్లీ తల్చుకుని మళ్లీ బాల్యంగా రూపొందాలని
జన్మించాలని వుంది.
కారు చీకట్ల మేఘాలని చూసి భయపడి
బడిపాక కారిపోతుందని జావకారిపోయే మా
మాష్టారు
పిల్ల కూనలు తడవకూడదని
లాస్ట్ బెల్ మోగించి బడి వదిలేస్తే
మోగుతున్న బెల్ శబ్దం చెవుల్లో దూరీ దూరక ముందే
నెత్తిన పుస్తకాలెట్టుకుని
గుంపులో గోవిందనై ఓ....యని అరుస్తూ
ఇంటికి దౌడు తీసిన ఆ రోజుల్ని తల్చుకుని
మళ్లీమళ్లీ పరుగులెత్తాలని వుంది.
బాల్యమయి పోవాలని వుంది
ఇప్పుడు అనాకారిగా వయసు పెద్దతనం
మీద మీదకొస్తుంది.
ఆవేదన అయాచితంగా అక్షర రూపం నేర్చింది
అక్షరం నా గుండెకి ప్రాణవాయువుని ధారపోస్తుంది.
బతుకంటే ఇప్పుడు జీవన పోరాటం
బతుకంతా ఇప్పుడు నిరంతర ప్రయాణం
బతకడమంటే ఇప్పుడు బతకనేర్వడం
ఇమడలేక వేగలేక ఈ సమాజంలో
నిరంతరం నన్ను నేను హత్య చేసుకోవడం
జీవితమంటే... ఇదికాదు
ఒకనాటి నా బాల్యం
చినుకులో చినుకునై పోవాలని కోరుకోవడం
ఆ చినుకు చుక్కల మధ్య
నేనో మొక్కనయి కాగితం పడవనయి
కాసేపయినా ఆ జ్ఞాపకాల్లోకి జారిపోయి
బతికిపోవడం.



భరోసా స్పర్శ

- వి. సునంద

ఆలోచనల పూడికను తవ్విపోశాను
అక్కడేమైనా ఆచూకీ దొకుతుందేమోనని
ఇసుమంతైనా జాడలేదు - ఇసుక రాశి తప్ప
నీడను నిశితంగా గమనించాను
కష్టాల్లో సుఖాల్లో వెన్నంటి ఉంటుందేమోనని
ఊ హూ
నిశీథిలో నిశ్శబ్దంగా జారుకున్న తను నాకేమిస్తుంది చిక్కటి విచారాన్ని తప్ప
అన్వేషణ సాగించాను
అలల కడలిని చూశాను
తీరం దాటిన అలను వదిలి - కెరటాలతో ఆడుకోవడం
పిల్ల తెమ్మెరను పరికించాను - ఋతువుకు లోబడి తన గతిని మార్చుకోవడం
లోకమంతా గాలించాను - అణువణువునా వెతికాను
ఆత్మీయులు - అతిథులు - స్నేహితులు బంధువులు
పరిమిత భరోసా కాదనలేను
కానీ
నన్ను నన్నుగా [illegible] - [illegible] లాలించే స్పర్శ
నన్ను పాలించే స్పర్శ - ఏదీ..? ఎవరిస్తారు...?
విచారంలో మునిగిన నాకు - వినిపించిందొక వీణానాదం
ఎక్కడ నుండా అని - నలుదిశల దృష్టి సారించాను
మైమరచి చూశాను
నేనిచ్చే ఆలోచనా స్పర్శ చాలదా - ఊహ తెలిసిన నాటినుండి
ఊపిరి చివరిదాకా...
తోడు నీడగా ఉన్నానంటూ - ఓ అపూరూప స్పర్శానుభూతి
నా ప్రతిరూపమై తనను తాను ఆవిష్కరించుకుంది
ఆలింగనం చేసుకున్నాను
ఆనందంతో నా హృదయం ఆనంద భాష్పాలు రాల్చింది ★

సంక్రాంతి స్పెషల్స్



అరిసెలు

కావలసిన పదార్థాలు

బియ్యం - కేజీ, బెల్లం - ముప్పావుకేజీ,
నువ్వులు - 100 గ్రాములు, నీరు - తగినంత,
యాలకులు - 2 లేక 4 (మెత్తగా పొడిచేసుకోవాలి), నెయ్యి - పావు కప్పు,
నూనె - వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

బియ్యం రాత్రి నానబెట్టుకోవాలి. ఉదయం చిల్లులగిన్నెల్లో వడవేసి పిండి పట్టించుకోవాలి. పిండి తడి ఆరిపోకుండా నొక్కి ఉంచుకోవాలి. ఈలోపు పొయ్యిమీద మందపాటి గిన్నె పెట్టుకుని అందులో చిదిమిన బెల్లాన్ని వేసి కొద్దిగా నీరు పోసి పాకం పట్టుకోవాలి. (అరిసెలు గట్టిగా కావాలంటే ముదురుపాకం, మెత్తగా కావాలంటే లేతపాకం) పాకం రాగానే నువ్వులు, నెయ్యి, యాలకుల పొడి వేసి కలుపుకోవాలి. తర్వాత బియ్యం పిండి ఒకరు వేస్తుంటే మరొకరు ఉండ చుట్టకుండా కలపాలి. ఉండలు చేసుకోవడానికి వీలుగా ఉండేంతవరకూ పిండి వేసి కలపాలి. ఇప్పుడు పొయ్యి మీద కళాయి పెట్టుకోవాలి. అందులో నూనె వేసి కాగనివ్వాలి. ఈలోపు పిండిని చిన్న చిన్న ఉండలు చేసుకొని ప్లాస్టిక్ కవర్ మీద అరిసెలు వత్తుకొని కాగిన నూనెలో వేసి వేయించుకోవాలి. బంగారు వన్నె రాగానే వాటిని తీసి అరిసెల పీటపై (గరిటెలు కూడా ఉంటాయి) ఉంచి వత్తుకోవాలి. దీనివల్ల అరిసెల్లో అదనంగా ఉన్న నూనె పోతుంది. వీటిని ఆరబెట్టుకోవాలి. అంతే నోరూరించే అరిసెలు రెడీ..!

(గమనిక: పాకం వచ్చింది రానిదీ చూసుకోవాలంటే చిన్న గిన్నెలో కొద్దిగా నీళ్లు పోసి పాకం రెండు చుక్కలు వేసి చేత్తో దగ్గరకు తీస్తే ఉండ చుట్టుకోవాలి.నీటిలో కరగకుండా ఉండకడితే పాకం వచ్చేసినట్లే.)



సకినాలు

కావలసిన పదార్థాలు

బియ్యం - 4 కప్పులు
వాము - పావుకప్పు
నువ్వులు - అరకప్పు
ఉప్పు -తగినంత, నీరు - తగినంత
నూనె - వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం

బియ్యాన్ని 3-4 గంటలు నానబెట్టుకోవాలి. వాటిలో నీటిని వంచేసి మూడు గంటలు ఆరనివ్వాలి. దీన్ని మెత్తగా పొడి చేసుకోవాలి. నువ్వులను సన్నసెగన దోరగా వేపి ఉంచుకోవాలి. ఇప్పుడు బియ్యం పిండిలో నువ్వులు, వాము, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నీళ్లు పోసుకుంటూ గారెల పిండిలాగా కలుపుకోవాలి. తడిపి పిండిన బట్టపై చేత్తో సకినాలు చుట్టలు చుట్టుకోవాలి. ఇవి కొన్ని తయారయ్యేలోపు పొయ్యిమీద కళాయి పెట్టి నూనె పోసి వేడిచేసుకోవాలి. నూనె కాగాక తయారుచేసిన సకినాలు వేసి దోరగా వేపుకోవాలి. వీటిని టిష్యూ పేపర్‌పై వేసి తీస్తే అదనంగా ఉన్న నూనె పోతుంది. గాలి చొరబడని డబ్బాలో పెట్టుకుంటే నెలరోజుల వరకూ నిల్వ ఉంటాయి. అంతే ఎంతో చక్కని సకినాలు రెడీ...!

- శాంతిశ్రీ

చెక్కలు

కావలసిన పదార్థాలు

బియ్యం - ఒక గ్లాసు, అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ - 1 టీ స్పూన్,
కరివేపాకు - 2 రెమ్మలు, ఉప్పు - తగినంత
నానబెట్టిన శనగపప్పు - ఒక కప్పు
నూనె - వేయించడానికి సరిపడినంత
నీరు - తగినంత, వెన్న - అరకప్పు

తయారుచేసే విధానం

బియ్యప్పిండి (తడిపిండి అయితే చాలా రుచిగా ఉంటుంది) లో వెన్న, శనగపప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, కరివేపాకు (చిన్న చిన్న ముక్కలు చేసి) వేయాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని నీళ్లు పోసుకుంటూ చపాతీ పిండిలా కలుపుకోవాలి. పొయ్యిమీద కళాయి పెట్టి నూనె వేడి చేసుకోవాలి. ముందుగా కలిపి పెట్టుకున్న బియ్యంపిండి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకొని తడిపి పిండిన బట్టపై గానీ, ప్లాస్టిక్ కవర్‌పై గాని చిన్న చిన్న అప్పడాల మాదిరి వత్తుకోవాలి. (పూరి మిషన్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్ల మధ్యలో నూనె రాసి, పిండిముద్ద ఉంచి వత్తుకోవచ్చు. ఇలా చేసినవి చాలా పలచగా వస్తాయి. చేత్తో చేసినవి కొద్దిగా మందంగా ఉంటాయి.) వీటిని నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన చెక్కలు తయార్..!



బూంది లడ్డూ

కావలసిన పదార్థాలు

శనగపిండి - 1 కప్పు, పంచదార - 1 కప్పు
నూనె - తగినంత
నీరు - తగినంత
యాలకుల పొడి - కొద్దిగా
జీడిపప్పు, కిస్మిస్ - 10 (నేతిలో వేయించి ఉంచుకోవాలి)

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో శనగపిండి తీసుకొని నీళ్లు పోసి దోసెల పిండిలాగా కలుపుకోవాలి. పొయ్యి మీద కళాయి పెట్టి నూనె పోయాలి. ఈ నూనె వేడెక్కేలోపు మరో పొయ్యి మీద మందపాటి గిన్నెలో పంచదార, యాలకుల పొడి వేసి కొద్దిగా నీళ్లు పోసి, పాకం పట్టుకోవాలి. కాగిన నూనెలో కలిపి పెట్టుకున్న శనగపిండిని బూందీ గరిటెలో పోసి చేత్తో రుద్దాలి. బూందీని ఎర్రగా కరకరలాడేలా వేయించకూడదు. కొంచెం ముందుగానే నూనెలో నుండి తీయాలి. ముందుగానే తయారుచేసి పెట్టుకొన్న పాకంలో బూందీ వేసి కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని కావలసిన సైజుల్లో లడ్డూలుగా చేసుకోవాలి. లడ్డూలపై ముందుగా వేయించిపెట్టుకున్న జీడిపప్పు, కిస్మిస్‌ను అందంగా అలంకరించుకోవాలి. అంతే నోరూరించే బూందీలడ్డూ తయార్.



కథ

ఇది నీ కోసం...



ఆస్ట్రేలియా కథ : మూలం - మైఖేల్ వెల్డింగ్

అనువాదం- రంగనాథ రామచంద్రరావు

వాళ్ల విడిపోవటానికి మునుపే ఆమె అతణ్ణి తోలుబొమ్మలా మార్చింది. చింకి బట్టల్ని నింపి కుట్టిన ఒక బొమ్మ ఎంతవరకు అతణ్ణి పోలివుండగలదో అంత పోలిక ఆ బొమ్మకు వుంది. ఆ బొమ్మను అతడికి అచ్చు అనవచ్చు. నకలూ అనవచ్చు. అతడిలానే ఉన్న వ్యంగ్య చిత్రమో లేదా ప్రతికృతో అనవచ్చు. ఆ బొమ్మది చిన్న ఆకారం, ఉడిగిపోయిన ఆకారం. ఎత్తైన మనిషి హఠాత్తుగా బొమ్మ ఎత్తుకు కుదించుకుపోయినట్టు వుందది. దాన్ని చూస్తే, దాని గురించి ఆలోచిస్తే అది అతడే అని అనిపించేది. అతడి వ్యక్తిత్వాన్ని అది దాచిపెట్టే ప్రయత్నమూ చేయలేదు. అది అతడి ప్రతిరూపమే. అతడు ఎలా కనిపిస్తున్నాడో అలాగే వుంది. ఆ కారణంగానే దాన్ని ఆమె అతడికిచ్చింది.

"ఇది నీకోసమే" అంది.

ఓ క్షణం ఆగి మళ్లీ – "ఇది నీది. ఇది నీవే. దీన్ని చూస్తే నీ జీవితం ఎలా వుందో చెప్పొచ్చు" – అని అంటూ ఎముకలు కొట్టొచ్చినట్టు కనిపించే తన వేళ్లతో ఆ బొమ్మను పట్టుకుని చూపించింది.

ఆ బొమ్మను చుట్టిన రంగుల కాయితాన్ని అతను విప్పాడు. దాన్ని చుట్టిన తీరు, రవ్వంత కూడా నాజూకత లేని ఆమె ప్రవర్తనకు తగినట్టు వుంది. అతను బొమ్మను లేపి బల్లమీద వుంచాడు. అతనే ఆ బొమ్మకు ప్రతిబింబంలా వున్నాడు.

ఆ బొమ్మను అతను ఇష్టపడ్డాడు అని అనటం కన్నా అతను గుర్తించాడనవచ్చు. ఆ బొమ్మను చూసి తను కాదనుకున్నాడు. ఆ బొమ్మే తను అనుకున్నాడు. అలా అనుకోవడంతో అతను పరాధీనతను తప్పించుకోవాల్సి వచ్చింది. వాస్తవానికి బొమ్మను బొమ్మలా చూస్తే చాలు, అలా గుర్తించటమే సరైంది. అయితే అలా చేయటం మాని, అది అతని లక్షణాలతో కూడిన బొమ్మ కావటంవల్ల, దాన్ని అదే పనిగా తదేకంగా చూడడం వల్ల పరాధీన భావనకు లోనయ్యే పరిస్థితికి వచ్చాడు.

'అది నేనే' అని అంటే, ఒక విధంగా చిత్రమైన వ్యక్తిత్వాన్ని ఒప్పుకున్నట్టవుతుంది. ద్వంద్వప్రవృత్తి. తన కారుకు వున్న నెంబరు ప్లేటుకు బదులుగా మరో నెంబరు ప్లేటు బిగించినట్టు ఓ ఆలోచన తనలో కదిలి కనిపించకుండా పోయింది.

తన పోలికలున్న చింకి బట్టల బొమ్మకు వున్న మృదుత్వం అతడికి కాసింత అసంతృప్తిని కలిగించింది. తనలో ఆ విధమైన మృదుత్వం వుందని అతనికి అనిపించలేదు. అయితే ఆ బొమ్మ తను అనుకున్న దానికన్నా ఎక్కువ సున్నితంగా వుందనిపించింది. దాన్ని చేసిన విధానం అలా వుంది. అది అనేక సంవత్సరాలనుంచి అలాగే వుంది. ఆ బొమ్మలో దూర్చిన చింకిబట్టలు బయటకు రాలేదు. ఆ బొమ్మ మృదువుగానే వుంది.

ఆ బొమ్మను దురదృష్టకారకంగా భావించక్కర్లేదు. అది వారు విడిపోవటానికి గల కారణపు ఒక చేదు భావనను మాత్రమే సూచించేది. ఆ చేదు భావనను సూచించే పొట్టివాడిని సృష్టించే నేపథ్యంలో కేవలం హస్త కౌశల్యాన్ని చూపించే ఉద్దేశ్యం కాకుండా మరో ఉద్దేశ్యం ఏదైనా వుందా అని అతను ఆలోచించాడు. అతణ్ణి నీచంగా చూపించాలనే ఉద్దేశమా? దానికి సూదులను గుచ్చి, దాని ఎదుట కొవ్వొత్తులను వెలిగిస్తే, అతని శరీరానికి ముళ్లు గుచ్చినట్టు అనిపించివుండొచ్చా? అలాగైతే సూదులను ఎక్కడెక్కడ గుచ్చాలి? ఎక్కడెక్కడ పొడిపించుకోవాలా అని అతనిలో ప్రశ్నలు తలెత్తాయి. ఆ ప్రశ్న అతనే ప్రశ్నించుకునేంత సులభంగా లేదు. ఇది అడిగేటంతటి ప్రశ్న కాదు. అందులోనూ ఆమెను అడిగే ప్రశ్న కాదు. అలాంటప్పుడు ఈ ప్రశ్నకు ఎవరు జవాబివ్వాలి?

ఆ బొమ్మ అతడి కళ్ల ఎదుట ఉన్నప్పుడు ఏవేవో ప్రశ్నలు అతణ్ణి వేధించేవి. ఆ కారణంగా దాన్ని తన చుట్టుపక్కల లేకుండా తన కంటికి కనిపించకుండా, ఓ పుస్తకాల బీరువా మీదకు దాన్ని విసిరేశాడు. రోజుల తరబడి, వారాల తరబడి, సంవత్సరాల తరబడి దాని మీద దుమ్ము, ధూళి చేరి బొమ్మ జుత్తు బూడిద రంగుకు తిరిగింది. ముఖం అక్కడక్కడ వొలిచి వేసినట్టు మారింది.

అతడికి సూది గుచ్చే భయం లేదు. ఆ బొమ్మను వున్నచోటనే వుంచటం వల్ల, దానికి ఎవరైనా సూది గుచ్చేటట్టయితే, అతడే గుచ్చాలి. అతనైతే ఆ పని చేయటంలేదు. ప్రయోగించి చూడాలని కుతూహలంతోనూ గుచ్చటం లేదు. దేన్నైనా చూసి పట్టుకోవాల్సి వస్తే అందుకు భారీ మూల్యమే చెల్లించాల్సివస్తుంది. ఆ బొమ్మ పుస్తకాల బీరువా మీద ఓ మూలన పడివుండటం వల్ల అతను తన క్షేమం గురించి విచారించాల్సిన అవసరం లేదు. అయినా మనసు ఏ మూలనో ఆ బొమ్మనుంచి దూరంగా వుండాలనిపించేది. ఆ పొట్టిబొమ్మను చూస్తే ఆమె గుర్తు వచ్చేది. ఆమె గుర్తుకు రావటం అతనికి బొత్తిగా ఇష్టం లేదు. ఆ బొమ్మని ఎక్కడైనా పారేయాలని అనిపించేది. చెత్తబుట్టలో పారేస్తే? చెత్తబుట్టలో వేయటం వల్ల ఏదైనా జరగరానిది జరగవచ్చనే భయం. అలాంటి చర్యను చేపట్టటం వల్ల ఏమీ ప్రయోజనం లేదనిపించింది. అది కేవలం చింకి బట్టలతో చేసిన ఒక బొమ్మ కాదు!

ఇలాంటి ఆలోచనల మధ్య ఆ బొమ్మ వున్న చోటనే వుండి పోయింది. పుస్తకాల బీరువా మీద కూర్చొని వుంది. దాన్ని పుస్తకాల బీరువాలో పెట్టి దాని ఊపిరి తీయాలని అతను కోరుకోలేదు. సాధ్యమైనంతవరకు గాలి తగిలే చోటు దానికి కావాలి. ఊపిరి పీల్చుకునే సౌకర్యం దానికి వుండాలి. చుట్టూ చూడగలిగే వీలు ఆ బొమ్మకు వుండాలి. పరస్పరం కళ్లతోటే మాట్లాడవలసి వుంది. సంవత్సరాలుగా అతని కళ్లు

మాట్లాడాయి. ఆ కారణంగా ఆ బొమ్మకు ఏదో ఒక విధమైన శక్తి వుందని అతనికి అనిపించింది. అది దుష్టశక్తే కానవసరం లేదు. ఆ శక్తి అతణ్ణి మింగేసేదికాదు. దాన్ని సమాధాన పరచవలసిన ఆవశ్యకత లేదు. అయినా అది అతణ్ణి విచారానికి గురిచేసింది.

ఒక క్షణం దాని అస్తిత్వాన్ని అంగీకరించేవాడు. మరుక్షణం అలా చేసినందుకు తనను తను తిట్టుకునేవాడు. దాదాపు ప్రతిరోజూ ఇలాగే గడిచేది. దాన్ని సంపూర్ణంగా స్వీకరించకపోతే అతను సూదితో గుచ్చివుండొచ్చు. లేదా దాన్ని మంటల్లో విసిరేసి వుండొచ్చు. అతడికి ఒక్కొక్కసారి ఆ బొమ్మ పట్ల తీవ్రమైన అసహనం కలిగేది. ఆ అసహనాన్ని దాచే నాటకంలోనూ అర్థం లేదని అతడికి తెలుసు. అతడు ఆ బొమ్మను మంటల్లో విసిరేస్తే వెంటనే అతడి సమస్యకు పరిష్కారం లంభిచేది. అందుకు భిన్నంగా నెమ్మదైన అతడి ద్వేషం, ఏది చేయాలన్నా మీనమేషాలు లెక్కపెట్టే అతడి నైజం, సూర్యుడి వెలుతురులో అతడికి ఆ బొమ్మకు మధ్యన మెరుపుతో కూడిన సూక్ష్మమైన ధూళి కణాలు కనిపించటం, ఇది తను, అది తనలా వున్న బొమ్మ అనిపించటం, దాన్ని నాశనం చేయటానికి అడ్డుపడుతున్న అతడి పిరికితనం, అది అతడి అవసానదశ వరకు వుంటుందన్న అతడి నమ్మకం, ఇద్దరిలో ఒకరు లేకుండా పోయేటంతవరకు ఈ పరిస్థితి ఎందుకు కొనసాగుతుందనే ఆలోచనలు అతణ్ణి వేధించేవి. ఎవరు లేకుండా పోతారు. అనే ప్రశ్ననే లేదు. అతడి అంతం పొట్టివాడి అంతమూ అవుతుంది. అతడి జీవితం ముందుగా ముగిసినా, ఆ బొమ్మ బతుకు దాన్ని అనుసరిస్తుంది. మంటల్లో కాలిపోతుంది. మొదట ఎవరు చావాలన్నది అటు తరువాత వాళ్లకు అర్థమవుతుంది.

ఆ బొమ్మను తన భార్యకు తిరిగి ఇచ్చి వేయాలని అనుకున్నాడు. అలా చేస్తే ఆమెను తనే పలకరించినట్టు అవుతుందనిపించింది. అది అతడికి ఇష్టం లేదు. ఆమె అపార్థం చేసుకోవచ్చు. ఆమె బహుమతిని ఆమెకే తిరిగి ఇవ్వటంవల్ల జరగరానిదే జరగిపోవచ్చు. తిరిగి ఇచ్చిన బొమ్మను ఆమె స్టోర్‌రూంలో పారవేస్తే సర్వనాశనమే జరగవచ్చు. ఆమెకు తిరిగి ఇవ్వటం కన్నా తన దగ్గర వుంచుకోవటమే క్షేమం లేదా మరెవరికైనా ఇచ్చేస్తే? వాళ్లు ఏమేమి మాయలు చేస్తారో ఏమో? దాన్నో ఆట వస్తువుగా భావించి దాని మెడకు ఉరిబిగించి వేలాడదీయవచ్చు. లేదా దాన్ని తమ కుక్కపిల్లలు ఆడుకోవడానికి పడవేయవచ్చు. అక్కర్లేదు! అలా జరగటానికి వీల్లేదు. ఇది తన వస్తువు. ఇతరులెవ్వరికీ ఇచ్చే వస్తువు కాదు. కళ్లెదుటవున్నా పరవాలేదు అని అనుకున్నాడు.

అతను వేరే ఊరికి వెళ్లేటప్పుడు ఆ బొమ్మను తీసుకు వెళ్ళేవాడు కాదు. అతను తన దుస్తుల్ని సూట్‌కేసులో సర్దేటప్పుడు అది అతడిని గమనించేది. ఆ బొమ్మను తీసుకువెళ్ళటానికి అతడి మనసు అంగీకరించేది కాదు. మూసిన సూట్‌కేసు లోపల దాని ఊపిరి ఆగిపోవటం అతనికి ఇష్టం లేదు. ఇంటినుంచి బయటికి వెళ్లేటప్పుడు దాన్ని ఇంట్లోనే వదలి వెళ్లటం మంచిదని అతనికి అనిపించేది. ఆ బొమ్మను ఇంట్లోనే వదలి బయటికి అడుగు పెట్టగానే కొత్త జీవితంలో అడుగు పెడుతున్నట్టు అతడికి అనిపించేది.

అతడు ఇంటి బయట వున్నప్పుడు అతనికి తన గది గుర్తుకొచ్చేది, అక్కడి వస్తువులను కళ్లముందుకు చిత్రించుకున్నప్పుడు, ఆ బొమ్మ కూడా ఎదుటకొచ్చి నుంచునేది. అది అతడి ప్రతినిధిగా వుండేది. అతడి రాజ్యానికి రక్షకుడై వుండేది. కర్తవ్యనిష్ఠ దేహమై వుండేది. అతడి ఆత్మ ఎక్కడెక్కడో తిరుగుతూ వున్నప్పుడు అది అతని ఇంట్లో వున్న మట్టిదేహమైవుండేది. చివరికి అది వున్నచోటికే అతడు తిరిగొచ్చేవాడు.

ఆ బొమ్మ అతడికి ఎంతో ప్రియమైనది!

★









గాలి పటమా... పద... పద...

పతంగులను ముఖ్యంగా వినోదం కోసం ఎగురవేస్తారు. ధనుర్మాసంలో సంక్రాంతి వస్తుందనగా ఎక్కడ చూసినా పిల్లలు పతంగులతో కనపడతారు. అవి గాలిలో పైపైకి పోతుంటే వారి మొహాలు చూడాలి. సంతోషంతో వెలిగిపోతుంటాయి. అయితే ఇదే సంతోషం...ఆనందం గుజరాత్‌లో కూడా వుంటుందంటే నమ్ముతారా! ఎందుకంటే సరిగ్గా ఈ రోజున అహ్మదాబాదులో జరిగే అంతర్జాతీయ పతంగుల పండుగలో పాల్గొనటానికి దేశదేశాలనుంచి వచ్చేస్తారు. విభిన్న ఆకృతుల్లో పొడవాటి పతంగులను ఎగరేసి గట్టి పోటీనిస్తారు. మరి ఆ ఆసక్తికరమైన అంశాలను తెలుసుకోకపోతే ఎలా!

పతంగులను తయారుచేయడం ఒక కళ అయితే దాన్ని ఎగురవేయడం మరో కళ. గాలిపటాలను 2,800 వందల సంవత్సరాల క్రితం చైనాలో కనుగొన్నారు. మనిషికి ఎగరాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఈ పతంగి పుట్టిందట. మొదట వీటిని ప్రమాదంలో ఉన్నప్పుడు ఇతరులకు సమాచారాన్ని పంపించడానికి ఉపయోగించేవారు. తర్వాత శత్రు గుడారాల నుండి దూరాలను కొలవడానికి, వాతావరణాన్ని తెలుసుకోవడానికి, మనుషులను లేపడానికి, సంకేతాలను పంపించడానికి, మిలిటరీ వాళ్లకు సమాచారాన్ని అందించడానికి ఉపయోగించారు. మొదట్లో వీటిని దీర్ఘచతురస్రాకారంలో చేసేవారు. కొంతకాలానికి ఇవి జపాన్, కొరియా, థాయ్‌లాండ్, బర్మా, ఇండియా, అరేబియా, ఉత్తర ఆఫ్రికా దేశాలకు పాకాయి.

పతంగుల పండుగ

ఆసియా దేశాలలో గాలిపటాలకు ప్రత్యేక ప్రాముఖ్యత వుంది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో మకరసంక్రాంతి రోజు ప్రత్యేకంగా పతంగులను ఎగురవేస్తారు. ప్రతి సంవత్సరం జనవరి 14 నాడు దక్షిణ భారతదేశంలో లక్షల మంది ఈ ఆట ఆడతారు. ముఖ్యంగా బీహార్, జార్ఖండ్, గుజరాత్, పశ్చిమబెంగాలలోని కొన్ని ప్రాంతాలలో, జైపూర్, ధనాబాద్, హైదరాబాద్‌లలో పతంగుల పండుగను జరుపుకుంటారు. హైదరాబాద్‌లో పతంగులను ఎగురవేసే దారాన్ని మంజ అంటారు. పతంగులను పేపరు, వెదురుతో తయారుచేస్తారు. కొన్ని నగరాలలో గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీ, కృష్ణాష్టమి పండుగల సమయంలో పతంగులను ఎగురవేయడం ఒక భాగం.

ఆ పండుగ రోజు పొద్దునే పతంగులను పట్టుకుని మిద్దెల మీదకు వెళ్తే సాయంత్రానికి గానీ కిందకు రారు. వీటిని విశాలమైన ప్రదేశాలలో గానీ, మిద్దెల మీది నుండి గానీ ఎగురవేస్తారు. ఆ రోజు మొత్తం తిండి కూడా తినకుండా ఆ ఆటలో మునిగిపోతారు.

ఇరుగుపొరుగు రాష్ట్రాలలో..

పతంగులను సంవత్సరంలో ఎప్పుడైనా ఎగురవేసుకోవచ్చు. హర్యానాలో పతంగులు ఎగురవేయడాన్ని సాంస్కృతిక క్రీడగా పరిగణిస్తారు. అక్కడ ఎక్కువగా బసంత్ పంచమి, రాఖీ, మకరసంక్రాంతి రోజు పతంగులను ఎగురవేస్తారు. వారు పతంగులను ఎగురవేసే దారాలను డోర్ అంటారు. పంజాబ్‌లో గడ్డి లేదా మంజా అని అంటారు. వారు ప్రేమ సమాచారాన్ని పతంగుల ద్వారా పంపిస్తారట. ఢిల్లీలో స్వాతంత్ర్యదినోత్సవం రోజు పతంగులను ఎగురవేస్తారు.

అంతర్జాతీయ పతంగుల పండుగ

గుజరాత్‌లో పతంగులను ఎగురవేయడం చాలా ముఖ్యమైన పండుగ. అక్కడ ముఖ్యనగరాలైన వదోదర, సూరత్, అహ్మదాబాద్ నగరాలలో ప్రతి సంవత్సరం జనవరి 14వ



తేదీన తప్పకుండా ఆడతారు. ఇతర ప్రాంతాలలో కంటే ఇక్కడ చాలా భిన్నంగా ఈ పండుగ జరుగుతుంది. అంతర్జాతీయ పతంగుల పండుగ అహ్మదాబాద్ నగరంలోని సర్దార్ వల్లభాయి పటేల్ స్టేడియంలో గానీ, పోలీస్ స్టేడియంలోగానీ జరుగుతుంది. ఆ రోజు భారతదేశంలోని కైటిస్టులు మాత్రమేకాదు విదేశాల వారూ పాల్గొంటారు. ఈ పోటీల కోసం నెల రోజుల ముందు నుంచే రకరకాల డిజైన్లలో పతంగులను తయారుచేస్తారు. ఇది ఉత్తరాయణ లేదా మకరసంక్రాంతి రోజు నాడు వచ్చేవిధంగా ఈ తారీఖును ఎంచుకున్నారు. సూర్యుడు ఉత్తర వలయం నుండి దక్షిణ వలయంలోకి ప్రవేశించి చలికాలం అయిపోతుందనడానికి గుర్తుగా మకర సంక్రాంతిని జరుపుకుంటారు.

ఆసక్తికరమైన అంశం ఏంటంటే... ఆరోజున జరిగే పోటీలు చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. వివిధ ఆకృతుల్లో ... ఆకారాల్లో ఆకట్టుకునే గాలిపటాలు అలా అలా వయ్యారంగా ఆకాశంలో ఎగురుతోంటే...ఆకలిదప్పికలుండవు. సమయం తెలీదు. అక్కడ చేపలు, దేవతలు, దెయ్యాలు, భయంకరమైన జంతువులు, పక్షులు, సూపర్‌మ్యాన్ వంటి మనుషులు అంతా...గాలిపటాల రూపంలో ఆకాశంలో విహరిస్తారు. సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతారు.

రాత్రుల్లూ...ఎగురుతాయి

పతంగుల పండుగ పగలు మాత్రమే జరుపుకుంటారనుకుంటే మీ గాలిపటం దారం తెగిపోయినట్టే. ఎందుకంటే... ఇక్కడి వారు రాత్రుళ్ల కూడా గాలిపటాలు ఎగరేస్తారు. వెలుగులు నింపుకున్న పతంగులు ఆకాశంలో నక్షత్రాల్లా మెరుస్తూ కనిపిస్తాయి. వాటిని చూసి పిల్లలే కాదు పెద్దలు కూడా చిన్నారుల్లా చప్పట్లు చరిచి ఆనందించాల్సిందే. అందుకే ఈ సందర్భంగా అహ్మదాబాద్‌లోని పతంగ్ బజార్‌లో గాలిపటాలను పగలూరాత్రీ అన్న తేడా లేకుండా అమ్ముతూనే వుంటారు. ఇక్కడి ఢిల్లీ దర్వాజా కూడా పతంగుల మార్కెట్‌కు పేరుగాంచినది. ఈ ప్రాంతాన్ని పాలించిన నవాబులు, రాజులు పతంగుల క్రీడను బాగా ప్రోత్సహించేవారట. ఈ మార్కెట్లలో పది రూపాయలు మొదలుకొని వందల రూపాయల విలువ చేసే గాలిపటాలు లభిస్తాయి. అంతెందుకు! పతంగుల పండుగకు నెల రోజులుండనగానే...ఇక్కడ సందడి మొదలౌతుంది. నేల మీద తయారుచేసే వాటిని తయారు చేస్తూ వుంటే... ఎగరేసేవాళ్లు ఎగరేస్తూ వుంటారు.

గాలిపటం అంటే కేవలం కాగితం, పుల్లలతోనే చేస్తారనుకుంటే పొరపాటే. ఫైబర్ గ్లాస్, నైలాన్‌తో పాటు మోటరైజ్డ్ గాలిపటాలను కూడా రూపొందించి ఎగరేస్తారు.

దేశదేశాల్లో...

పతంగులను ఎగురవేయడమే కాదు, ఎదుటివాళ్ల పతంగులను కిందకు తోసే పోటీలు కూడా ఉంటాయి. దీంతో పోటీదారులు ఇతరుల పతంగులను కిందకు తోయాలని తెగ ప్రయత్నిస్తారు. తమ పతంగుల దారాలకు జిగురు, గాజు పొడి రాసి పంపిస్తారు. దీంతో అవి ఇతర పతంగులకు రాచుకుని తెగిపోతాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో ఈ ఆటను 'గుడిపరన్ బజి' అంటారు. తాలిబన్ నియమం ప్రకారం ఈ మధ్య ఆఫ్ఘనిస్తాన్‌లో ఇతర వినోదకరమైన ఆటలతో పాటు దీనిని కూడా నిషేధించారు. వియత్నాంలో తోకలు లేని పతంగులను చేస్తారు. పాకిస్తాన్‌లోనూ 'బసంత్' అనే పండుగ రోజు పతంగులను ఎగురవేయడం వారి ఆచారంగా ఉండేది.

విజ్ఞాన వికాసం- గాలిపటం

సామాజిక ఉపయోగాలలోనూ పతంగులకు ముఖ్య పాత్ర ఉంది. బెంజిమిన్ ఫ్రాంక్లిన్‌కు మెరుపు విద్యుత్ అని నిరూపించడానికి పతంగి ఉపయోగపడింది. మొదటి విమానం అభివృద్ధికి పతంగి తోడ్పడింది. రేడియో అవసరాలకు కూడా ఇది బాగా ఉపయోగపడింది. సమాచారాన్ని గాలిలోకి పంపే (ట్రాన్స్‌మీటర్), గాలిలోని సమాచారాన్ని గ్రహించే (రిసీవర్) పరికరాలను మోయడానికి పతంగులను ఉపయోగించేవారు. ★

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఎంతటివారైనా సరే పతంగులను ఎగురవేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకే బుద్ధిగా వాటిని పాటిద్దాం. సురక్షితంగా ఇల్లు చేరుకుందాం.

- గాలిపటాలను డాబాల మీద కాకుండా ఖాళీ ప్రదేశాలలో ఎగరేయాలి. కానీ పట్నాలలో ఆ మాత్రం సౌకర్యం ఎక్కడుటుంది. అందుకే ఆటస్థలాలను ఎంచుకోవాలి.
- జనాల మధ్య, ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న చోట పతంగులను ఎగురవేయొద్దు.
- రోడ్ల దగ్గర పతంగులను ఎగురవేస్తే రోడ్డు ప్రమాదం జరిగే అవకాశముంది.
- విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలి.
- విమానాశ్రయాల దగ్గర ఎగురవేయొద్దు.
- గాలి వచ్చే సమయాల్లో గాలిపటాలను ఎగురవేయకపోవడం మంచిది.
- పతంగి ఎగురవేసే చుట్టు పక్కల ప్రాంతాలలో కుక్కలు లేకుండా చూసుకోండి. సాధారణంగా పతంగి కిందకు వచ్చినప్పుడు కుక్కలు భయపడి అక్కడి నుంచి వెళ్లిపోతాయి. కానీ ఒక్కోసారి అవి పతంగిని తీసుకెళ్లిపోతాయి.



తేడాలేంటో...

హాయ్ నేస్తాలూ! కిందున్న రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా వాటిలో ఐదు తేడాలు వున్నాయి. అవేంటో చెప్పండి మరి.





ఆవలి ఒడ్డుకు చేరేదెలా?

నేస్తాలూ... అక్కడో నది వుంది కదా. అక్కడేమో ఒకరైతు, తోడేలు, క్యాబేజీ, మేక వున్నాయి. అక్కడున్న పడవను ఉపయోగించి ఎదురుగా వున్న ఒడ్డుకు చేరాలి. ఆ పడవలోనేమో రైతుతో పాటు ఒక్కటి మాత్రమే ప్రయాణించడానికి వీలుంటుంది. వేటిని ముందుగా అవతలి ఒడ్డుకు చేరిస్తే వీరంతా సురక్షితంగా అవలి ఒడ్డుకు చేరగలరు?

సర్దగలరా?

హాయ్... ఇవాళ్ల మీకో పజిల్ తెచ్చామర్రా. కింద ఒక బాక్సు, ఆ పక్కనే గళ్లు కనిపించాయా. ఈగళ్లను అమర్చితే సరిగ్గా బాక్సులోకి సరిపోతాయి. మరి ప్రయత్నించండీ!



పాండాలెన్నో?

హాయ్ నేస్తాలూ... పైన ఎన్ని పాండాలు కనిపిస్తున్నాయి? ఏంటి రెండేకదా కనిపిస్తున్నాయి అంటున్నారా ... కానే కాదు. మీకు కనిపించే రెండు పాండాలే కాకుండా ఇంకా కొన్ని పాండాలున్నాయి. అవి ఎక్కడెక్కడున్నాయో చూసి ఎన్నో చెప్పండి.

నేర్చుకుందాం







ఎవరక్కడ?

నేస్తాలూ...పైన ఓ చక్కటి ప్రకృతి దృశ్యముంది కదా. దాన్ని ఎవరో చూస్తున్నారు. అయితే అక్కడ ఇంకెవరో కూడా వున్నారు. వారెవరో చెప్పకోండి.

నాలుగు ఎలా...

ఫ్రెండ్స్... కిందున్న అగ్గిపుల్లల అమరిక డైమండ్ ఆకారంలో కనిపిస్తుంది కదూ. ఇప్పుడు మీరేం చేయాలంటే అక్కడున్న వాటిలోనుండి నాలుగు అగ్గిపుల్లలను మాత్రమే మార్చి నాలుగు త్రిభుజాలను చేయాలి. తెలీకపోతే మా జవాబు చూడండి.





జంతువులెన్ని?

నేస్తాలూ...ఇక్కడున్న గజిబిజి గీతల్లో ఐదు జంతువులున్నాయి. అవేంటో చూసి వాటికి సున్నా చుట్టండే.

జవాబులు

__తేడాలేంటో... :__ 1. తల్లికోడి ముందు పూలు, 2. గుడ్లు, 3.గుడ్ల వెనక ఆకు, 4. చెట్టు పక్క మేఘం, 5. చెట్టు మీద ఉడుత.

__పొందాలెన్నో:__ 12.

__అవలి ఒడ్డుకు చేరేదెలా?:__ మొదటిసారి రైతు మేకను తీసుకుని అవతలి ఒడ్డుకు వెళతాడు. రెండవసారి తోడేలును తీసుకెళ్లి అవతలి ఒడ్డున దింపి మేకను వెనక్కు తీసుకెళ్ళి ముందున్న దగ్గరే వదిలి క్యాబేజీని తీసుకుని తోడేలు దగ్గర పెడతాడు. అప్పుడు వెళ్లి మేకను తీసుకొస్తాడు. ఇలా చేస్తే దేనికీ ప్రాణహాని వుండదు. అన్నీ అవలి ఒడ్డుకు చేరతాయి.

__ఎవరక్కడ?:__ తాత

__నాలుగు ఎలా...__



__సర్దగలరా..__



అరుగాలం చేసిన
శ్రమ ఫలించి ఫలసాయం ఇంటికొస్తే...
ఆనందమే ఆనందం! గూడు వదిలి వెళ్లిన
పిల్లలు- పిల్లాపాపలతో వచ్చి వాలితే...
సందడే సందడి!! చిన్ననాటి స్నేహితులూ,
సరదాలూ ఏకమై ఏరువాకలా సాగితే...
సంబరమే సంబరం!!!
ఆ ఆనందం, సందడి, సంబరం ఒకేసారి
సాధ్యమైతే, సాకారమైతే...
అది సంబరాల సంక్రాంతి! ఊరంతా
నవకాంతి!!

ఊరూరా సంక్రాంతి

-సత్యాజీ

సంక్రాంతి పెద్ద పండగ. దాదాపు నెలరోజులపాటు సంబరాలకు సన్నద్ధమయ్యే పండగ. ఎక్కడెక్కడో ఉన్న అందరినీ ఏకం చేసే పండగ. అత్తారిళ్లకు వెళ్లిన ఆడపిల్లలను, చదువులకో, బతుకుతెరువుకో బహుదూరం తరలిపోయిన మగపిల్లలను ఆత్మీయంగా ఆహ్వానించే పండగ. సంక్రాంతిని తలచుకోగానే మనసు సంబరంతో ఉరకలేస్తోంది. ఆనందంతో పులకరిస్తోంది. ఎన్నో జ్ఞాపకాలను తెరలుతెరలుగా గుబాళిస్తోంది.

సంక్రాంతి రావడమే గొప్ప ఆహ్లాదకర వాతావరణంలో వస్తోంది. నులివెచ్చని చలి గిలిగింతలు పెడుతుంటే- వెండితెరల పొగమంచు ఎన్నో వర్ణ దృశ్యాలను ఆవిష్కరిస్తూ ఉంటుంది. చల్లని మంచు బిందువులు పూలబుగ్గలపై మంచిముత్యాల్లా మెరుస్తుంటాయి. అప్పుడే ఉదయించిన సూరీడి అరుణ కిరణాలు ఆ జలముత్యాలకు పసిడికాంతులను ప్రసాదిస్తాయి. ఆ మూలన వారంరోజుల క్రితమే ఈనిన ఆవు అంబా అని మోరెత్తి పిలుస్తోంది. తల్లి పొదుగును కుడవడానికి లేగదూడ ఆరాటంతో గెంతులేస్తోంది. ఊరంతా ఆటలతో పాటలతో, నవ్వుల తుళ్లింతలతో కళకళలాడుతోంది. బిడ్డల సందడికి మురిసిపోయే తల్లిలా ఊరు ఆ మూడ్రోజులూ నిద్ర పోనేపోదు. కబుర్లతో, సందళ్లతో అమితానందం ఆస్వాదిస్తూ ఉంటుంది. అలాంటి సంబరాల సంక్రాంతికే ఊరు ఇప్పుడు స్వాగతం పలుకుతోంది!

నెలరోజుల సందడి

సంక్రాంతి మూడు రోజుల పండగ కాదు, నెలరోజుల సందడి. ధనుర్మాసం ప్రారంభం నుంచీ పండగ వాతావరణం నెలకొంటుంది. నెలగంట మోగిన నాటినుంచి వాకిళ్లు కొత్త అందాలను సంతరించుకుంటాయి. ముగ్గులతో ముస్తాబవుతాయి. రథాల ముగ్గులూ, రతనాల ముగ్గులూ ఎప్పటికప్పుడు సరికొత్తగా సింగారించుకొని పోటీ పడతాయి. కొత్త బట్టల కొనుగోళ్లూ, హరిదాసుల సందళ్లూ, గంగిరెద్దుల పరవళ్లూ మొదలవుతాయి. ప్రతి ఇల్లూ సంక్రాంతికి సన్నద్ధమవుతుంది. ఆ ఏడాది పంటనుబట్టి, ఫలసాయాన్ని బట్టి- పెట్టుపోతలు ఉంటాయి. 'పండగ బట్టలు తీసేశారా? పిండివంటలు మొదలెట్టారా?' వంటి పలకరింపులు సర్వసాధారణమవుతాయి.

ఎక్కడెక్కడినుంచో వచ్చే పిల్లలకోసం, మనవళ్లు, మనవరాళ్లకోసం ఏర్పాట్లు చకచకా సాగిపోతుంటాయి.

ఇక దూరంగా ఉన్నవాళ్లకు కూడా నెలరోజులనుంచే ఊరూ, ఇల్లూ క్షణక్షణానికీ గుర్తొస్తాయి. అమ్మకు ఏ రంగు చీర తీసుకెళ్లాలి? చెల్లికి ఏం కొనాలి? వంటి సంతోష సందిగ్ధాలు వెన్నాడుతుంటాయి. చిన్ననాటి స్నేహితులూ, బంధువులూ కళ్లముందు కదలాడతారు. ఎప్పుడు ఊరెళతామా అన్న ఉబలాటం సంతోషాన్ని రెట్టింపు చేస్తూ ఉంటుంది. కుటుంబ సమేతంగా ఊరికి బయల్దేరడం ఎక్కడలేని ఆనందం కలిగిస్తోంది. సొంత ఊరినీ, కన్నతల్లినీ, బంధుమిత్రులను కలుస్తామన్న హృదయానందం ఇతర ప్రయాణాల కన్నా అమితంగా, ఆహ్లాదంగా ఉంటుంది. ఈ సంగతి సంక్రాంతి వేళ ఊరెళ్లే ప్రతి ఒక్కరికీ అనుభవంలోకి వస్తోంది. ఈ పండగ సందర్భంగా హైదరాబాద్ వంటి నగరాలు ఖాళీ అయిపోతుంటాయి. నిత్యం రణగొణ ధ్వనులతో రద్దీగా వుండే రోడ్లు బోసిపోతాయి. అంతా సంక్రాంతి మహిమే.

పాడిపంటల పండగ

సంక్రాంతి పాడిపంటల పండగ. వ్యవసాయ ఫలసాయం ఇంటికొచ్చే వేళ... కళ్లం నిండా ధాన్యం ఉంటే... రైతు కళ్లల్లో ఆనందం తాండవిస్తుంది. అతడి సంతోషానికి పట్టపగ్గాలుండవు. ఆ ఉత్సాహాన్ని అందరితో పంచుకుంటాడు. ఉత్సవంగా జరుపుకుంటాడు. ఫలసాయం పొందే ప్రక్రియలో తనకు సహకరించిన ప్రతి జీవికీ, ఉపకరణానికీ చేతులెత్తి నమస్కరిస్తాడు. భోగి, సంక్రాంతి, కనుమ... ఈ మూడ్రోజులూ వ్యవసాయ సంబంధమైన విశేషాలతోనే ముడిపడి ఉన్నాయి. తాడిపెద్దును

గౌరవించడం, గంగిరెద్దును ఆదరించడం సేద్యం నేపథ్యంలోంచి వచ్చినవే!

ఈ పండగనిండా పశువుల ప్రాధాన్యం పరుచుకొని ఉంది. ధనుర్మాసం అంతా పశువులపేడను నీళ్లలో కలిపి వాకిళ్లలో కళ్లాపు చల్లుతారు. ఆపై ముగ్గులు అద్దుతారు. గొబ్బెమ్మలు అమర్చుతారు. పూలూ ఆకులతో అలంకరిస్తారు. భోగిమంటలో పిడకలు వేస్తారు. కనుమరోజున పశువులకు ప్రత్యేక పూజలు చేస్తారు. కొమ్ములకు పసుపు రాసి, నుదిటిన కుంకుమ అద్ది, రంగులతో అలంకరించి... సంతోషపడతారు. పళ్లూ, బియ్యం, పిండివంటలూ తినిపిస్తారు. గోమహాలక్ష్మి అంటూ గోవులను పూజిస్తారు. సేద్యంలో పశువుల స్థానే ట్రాక్టర్లు రంగప్రవేశం చేసినా– ఆ ఆచారం కొనసాగుతూనే ఉంది.

... ఆ ఆనందమే ఆనందం!

ఒకప్పుడు సంక్రాంతి అంటే సాంప్రదాయ సందళ్ల హడావిడి. పల్లెలు సంబరాలతో పరవశించి ఆడేవి. హరిదాసులు, కొమ్మదాసులు, తాడిపెద్దులూ, గంగిరెద్దులూ, కోలాటాలూ, కోల తిప్పడాలూ... ఊరునిండా ఒకటే సందడి! పండగ తరువాత రోజుకొక్క ఊరు చొప్పున వరసగా తీర్థాలు... వాటికి బోలెడు ఆదరణ.. ఒకప్పుడు పిల్లలు ఏమి కొనుక్కోవాలన్నా తీర్థాలే దిక్కు. రంగులరాట్నం ఎక్కాలన్నా, బొమ్మల చక్రం చూడాలన్నా తీర్థానికి వెళ్లి తీరాల్సిందే! పక్క ఊరి తీర్థంలో రంగురంగుల కళ్లద్దాలు, ప్లాస్టిక్ వాచీలూ, లక్కపిడతలు, చెక్కబొమ్మలు, బూరలు, చేతికి ఉంగరాలు... కొనుక్కొని టింగురంగమని తిరగడం గొప్ప సరదా. వీటికోసం పిల్లలంతా కలిసికట్టుగా వెళ్లి, పెద్దలనుంచి తీర్థం డబ్బులు వసూలు చేయడం గొప్ప సాహసం! అన్నీ కొనుక్కోగా కొన్ని డబ్బులు మిగిల్చి, మూడుముక్కలాటలో ఏనుగుమీదో, గుర్రం మీదో పందెం కాయడం ఒక ఉత్కంఠ. వస్తాయనుకున్న డబ్బులు చెక్కబల్ల మీదికి కుప్పగా చేరిపోవడం ఖాయమే అయినా ఏదో చిన్ని ఆశ. తీర్థం నుంచి తిరిగొస్తూ– నాలుగు జీళ్లు కొనుక్కుంటే– ఇంటికొచ్చేదాకా సాగేవి. జీడిపాకం అన్న జాతీయం ఏ పరీక్షలో ఇచ్చినా ఈజీగా రాసేసే అనుభవం ఈ తీర్థంలోంచే వచ్చేది.

తీర్థం జరిగే ఊరికి చుట్టుపక్కల ఊళ్లనుంచి తాడిపెద్దులు భజన బృంద సమేతంగా తరలివెళ్లేవి. పెద్దపెద్ద కంచు తాళాలను ఖంగుఖంగుమని మోగిస్తూ దాసులు పాటలు పాడేవారు. ఆ సందడి మధ్య దాసుడు మండుతున్న అగ్నికోలను ఒడుపుగా తిప్పుతూ విన్యాసాలు చేయడం వినోదంగా ఉండేది. సంక్రాంతి సందర్భంగా ప్రదర్శించే పౌరాణిక, సాంఘిక నాటకాలకు ఇసుకేస్తే రాలనంత జనం. పౌరాణిక నాటకాల్లో రాగం ఎంత లాగితే అంత గొప్ప. సాంఘిక నాటకాల్లో మాయల ఫకీరులా గంటల తరబడి నవ్వినవాడే విలన్ కింద లెక్క, గౌరవం. ఇవన్నీ తలచుకుంటే అదంతా ఇప్పుడొక వినోదం.





ప్రయోజనకరం.. పండగ ప్రయాణం

పండగలో ఒకప్పటి వినోదాలూ సరదాలూ ఇప్పుడు అంత అపురూపంగా అనిపించకపోవొచ్చు. అయినా, వాటి ప్రత్యేకత వాటిదే! తీర్థం అంటే ఒకప్పుడు ఉన్న మోజు ఇప్పటి పిల్లలకు ఉండదు. ఎందుకంటే- ఈ తరం పిల్లలు ఏ వస్తువు కొనుక్కోవాలనుకున్నా ఒక ఏడాదిపాటు వేచి చూడక్కర్లేదు. ఏ షాపింగ్‌మాల్‌లోనో సులభంగా కొనిపించగలుగుతారు. అయినా, పిల్లలను కనీసం ఒక తీర్థానికైనా తీసుకు వెళ్లండి. చిన్నప్పటి మీ ఆనందాన్ని మీ పిల్లలూ ఆస్వాదించేలా చూడండి. పొలాన్ని, హలాన్ని పరిచయం చేయండి. సంక్రాంతి వ్యవసాయ పండగ ఎలా అయిందో చెప్పండి. మీతోపాటు ఊరంతా తిప్పండి. ఊరుమ్మడి అవసరాలు ఎలా ఉంటాయో, ఎలా తీరతాయో వివరించండి. బంధుమిత్రులందరినీ పరిచయం చేయండి. బంధాలూ అనుబంధాలూ బలపడేది ఇప్పుడే! మీ మిత్రుల పిల్లలతో స్నేహం కలపండి. ఆర్థిక వ్యత్యాసాలూ, అంతస్థు అంతరాలూ ప్రదర్శించకుండా స్నేహాల, కుటుంబ సంబంధాల ఔన్నత్యం అర్థమయ్యేలా చూడండి. ఊరి మీద ప్రేమ, గ్రామీణ జీవనం మీద గౌరవం మీ పిల్లల్లో ఏమాత్రం మొలకెత్తించినా మీ సంక్రాంతి ప్రయాణానికి ఒక సరికొత్త ప్రయోజనం దక్కినట్టే!

ఊరూ మారింది!

అయితే, మునుపటి పండగ సందళ్లు ఇప్పుడు గ్రామాల్లోనూ లేవు. ఊళ్లు కూడా పట్టణాల్లాగానే మారిపోయాయి. మనం కవిత్వంలో వర్ణించుకున్నట్టు అందంగా లేవు. కథల్లో రాసుకున్నట్టు ఆనందంగానూ లేవు. వ్యవసాయం దారుణమైన ఒడిదుడుకులకు లోనవటమే దీనికి కారణం. పెట్టుబడులు పెరిగి, గిట్టుబాటు దక్కని పంటలూ, సాగు పద్ధతులూ వచ్చాయి. ఒకప్పుడు ప్రకృతి కరుణించకపోతే రైతుకు కాయకష్టమే పోయేది. ఇప్పుడు పీకల్లోతు నష్టాలొస్తున్నాయి. రైతు పండిస్తే ధర రాదు. పండించకపోతే తిరుగులేని గిరాకీ. పత్తి, పొగాకు, సరుగుడు, చెరకూ.. ప్రతి పంటా అంతే! సేద్యం ఇప్పుడు భరోసా ఇవ్వని వ్యాపకం. దీనికితోడు ప్రకృతి ప్రకోపాలు... కరువూ వరద... ఎప్పుడేమొస్తుందో! చిన్న రైతులు, వ్యవసాయ కూలీలూ అనివార్యంగా పట్టణాలకు వలస పోయే పరిస్థితి!

పాడి పొంగి పొర్లడం లేదు. ఊరు మూతి బిగియకట్టుకొని డెయిరీలకు పాలు పంపిస్తోంది! ఇక ఊరి సంస్కృతీ వేగంగా మారిపోతోంది. పట్టణంలాగానే పల్లెటూరి నెత్తి మీదా టెలివిజన్, దానికి రకరకాల ఛానెళ్లూ మొలిచాయి. సాంప్రదాయ కళలకు, కళాకారులకు ఆదరణ తగ్గిపోయింది. హరిదాసులు, కొమ్మదాసులూ అన్ని ఊళ్లలోనూ కనపడడం లేదు. ఊళ్లో సందడికి ఇంతకముందు రాములోరి గుడో, రచ్చబండో వేదిక. అందరూ అక్కడికి చేరాల్సిందే! టీవీలొచ్చాక సంబరాన్ని ఉమ్మడిగా ఆస్వాదించలేని పరిస్థితి! ఎవరింట్లో వాళ్లు... అచ్చం పట్టణంలాగానే!

... అయినా, పల్లెతల్లి పిలుస్తోంది!

ఏ సంబంధాల్లో ఎన్ని మార్పులొచ్చినా అమ్మ అమ్మే! సొంత ఊరు కూడా అంతే! చిన్నప్పుడు తిరిగాడిన నేలను తాకడం ఒక తన్మయత్వం. చిన్ననాటి చెలికాళ్లను కలవడం ఒక పారవశ్యం. చిన్నప్పుడు అమ్మతో కథలు చెప్పించుకున్న వేళప్పుడే... పిల్లలతో కలిసి అమ్మతో మాట్లాడడం ఒక ఆనందం. పొలంలోని పొన్నచెట్టు కింద నాన్నతో ముచ్చటించడం మహానందం. అక్షరాలు నేర్పిన బడిని, దిద్దించిన గురువునీ, చిన్ననాటి సాహసాల్లో భాగస్వాములైన సావాసగాళ్లనూ సందర్శించి సంభాషించడం ... అద్భుతానందం, ఆత్మీయ సంబంధం.

మనకే కాదు, అమ్మకూ అంతే! మన ఊరికీ అంతే! చదువులకని, ఉద్యోగాలకని, ఉపాధికని ఊరొదిలి వెళ్లిన బిడ్డలు... కలివిడిగా వచ్చి చేరితే అమ్మ ఆనందిస్తోంది. మనవళ్లనూ, మనవరాళ్లనూ మురిపెంగా చూసుకుంటూ చిన్నప్పటి గురుతులేవో వాళ్ల మాటల్లో చేతల్లో వెతుకుతుంటోంది. మన పిల్లల్లో మనకే తెలియని మన ఆనవాళ్లను పదిలంగా పట్టుకొని, ఆ పాత మధురాలకు అన్వయిస్తోంది. ఇలా ఎన్నో విధాల బంధాలు మరింత బలపడ్డానికి పండగ ఒక వేదిక అవుతుంది.

సంక్రాంతి సరదాలూ సంబరాలు

రూపంలో చాలా మార్పులు వచ్చినప్పటికీ- ఇప్పటికీ సంబరాలకు సంక్రాంతి పెట్టింది పేరు. ప్రతి ఊళ్లోనూ ఈ పండగ సందర్భంగా వినోద కార్యక్రమాలు ఏర్పాటవుతున్నాయి. ముగ్గుల పోటీలు, ఆటలపోటీలు దాదాపు ప్రతిచోటా జరుగుతున్నాయి. యువజన, మహిళా సంఘాలు ఈ సందర్భంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇక



సాంప్రదాయకంగా వస్తున్న కోడిపందాలు రెట్టించిన ఉత్సాహంతో నడుస్తున్నాయి. కోస్తాజిల్లాల్లో పెద్దఎత్తున ఈ పందాలు సాగుతున్నాయి. గోదావరి, కృష్ణా జిల్లాల్లో లక్షలు వెచ్చించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్క గోదావరి జిల్లాలోనే సంక్రాంతి కోడిపందాల్లో దాదాపు రూ.10 కోట్లు చేతులు మారుతాయట! దీనిని బట్టి ఎంత పెద్దఎత్తున పందాలు సాగుతాయో అంచనా వేయవచ్చు. ఎడ్లపందాల సంగతి సరేసరి. తెలంగాణా జిల్లాల్లో పతంగుల పండగ సంక్రాంతి సందర్భంగానే వైభవంగా జరుగుతుంది. పతంగుల పోటీలు కనువిందు చేస్తాయి. రాయలసీమలో కొన్నిచోట్ల పొట్టేళ్ల పందాలు నిర్వహిస్తారు. చట్టరీత్యా ఈ పందాలు నేరమైనా- పండగ రోజుల్లో సాంప్రదాయం పేరిట నిర్విఘ్నంగా సాగిపోతూనే ఉన్నాయి. సరదా పేరిట లక్షల్లో జూదం కూడా నడుస్తోంది.

ఊరికి వీడ్కోలు

పండగ మూడ్రోజులూ పరమానందంగా గడిచిపోతాయి. సెలవులు ముగిసిపోతాయి. స్కూళ్లూ, ఆఫీసులూ, మన పనులూ వెనక్కి రారమ్మని పిలుస్తూ ఉంటాయి. మళ్లీ వస్తామని అమ్మకీ, ఊరికీ, చెల్లికీ, స్నేహితులకీ చెప్పి వెనుదిరగాల్సి వస్తుంది. వచ్చినంత ఉత్సాహంగా ఉండదు, తిరిగి వెళ్లడం. అయినా, తప్పదు. కన్నతల్లుల కంట్లో కన్నీరు ఉప్పిల్లుతుంటుంది. పిల్లలను చంక దించడం భారంగా అనిపిస్తోంది. సాగనంపటానికి పచ్చిన ఇంటిల్లిపాదితో సగం ఊరు బస్టాండు దగ్గరే ఉంటుంది. 'మళ్లీ వేసవి సెలవులకు వస్తాం... చిన్ని పెళ్లికి రెండ్రోజులు ముందే వస్తాం. నాన్నమ్మా... వెళ్లొస్తాం.. అమ్మమ్మా... మళ్లీ వస్తాం.' బైబైలూ వీడ్కోళ్లూ. బస్సు వస్తూ ఉంటోంది దూరంగా. వీడ్కోలు చెప్పటం అంత ఈజీగా ఉండదు. అలా ఈజీగా ఉండకపోవడమే ఈ పెద్ద పండగ విశేషం, విశిష్టత. ★

ఏ గురకలో ఏ పరమార్థముందో!

ఈ పెద్దమనిషికి తినటం, గుర్రుపెట్టి నిద్రపోవటం తప్ప మరొకటి పట్టదు, ఈయనే అనుకుంటే ఇప్పుడు వీడొకడు తోడయ్యాడు... వీళ్లిద్దరినీ ఇంట్లో వదిలేస్తే తెల్లవారేసరికి మా జాతి వారెవరో ఇక్కడ ఉన్నారంటూ ఏనుగులూ, గాడిదలూ ఇంటి చుట్టూ చేరతాయి.... అంటూ ఎవరినీ తిట్టకండి.

ఒక పరిశోధనా పత్రికలో పాఠకులకు గురక గురించి ఒక ప్రశ్న ఇచ్చింది. అదేమంటే గురక పెట్టే మగవారికి తెల్లవారే సరికి 'తలనొప్పి' ఎక్కువగా వస్తున్నట్లు ఒక పరిశోధనలో తేలింది. దీనికి కారణాలు తెలియచేయండి. అని కోరింది. దానికి మరుసటి వారం వచ్చిన ఏకవాక్య జవాబు 'భార్యలు' అన్నది.

ఇది చదివిన తరువాత 'భర్తల'కు కోపం రావచ్చు. ఎందుకంటే గురకపెట్టేది మగవాళ్లేనా ఆడాళ్లు తక్కువా అని రుసరుసలాడవచ్చు. ప్రపంచంలో గురక గురుపీఠాన్ని ఏర్పాటు చేస్తే దానికి అధిపతిగా బ్రిటన్‌కు చెందిన మెల్విన్ స్విట్జర్‌ను నియమించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ పెద్దమనిషికంటే భయంకరంగా గురకపెట్టేవారెవరైనా ఉంటే బస్తీమే సవాల్ రావచ్చు అని గిన్నిస్ వరల్డ్ రికార్డుల వారు విసిరిన సవాలుకు జవాబు లేకపోవటంతో స్విట్జర్‌ను మహా గురక అనే అత్యున్నత స్థానంలో నిలబెట్టారు. ఆయన గురక మోటార్ సైకిల్ చేసే శబ్దం మాదిరిగా ఉంటుందట. అయితే బ్రిటన్‌కే చెందిన జెన్నీ చాంపమన్ అనే మహిళ భర్త, తన భార్య కూడా ఏమాత్రం తీసిపోకుండా గురకపెడుతుందని అన్నాడు. వాషింగ్‌మెషిన్, డీసెల్ ట్రక్, ట్రాక్టర్, రైలు శబ్దం, తక్కువ ఎత్తులో ఎగిరే జెట్ విమానం మాదిరిగా ఆమె గురక ఉంటుందన్నారు.

గురక గురించి అందరికీ తెలిసిందే కనుక మీరు మీమీ జోక్‌లు చెప్పుకోవచ్చు. గురక ఎన్నికాపురాలను కూల్చిందో లెక్కలేదు. ఎందరు కోర్టులకు ఎక్కారో, ఎందరు లాయర్లు తరతరాలకు సరిపడా ఈ కేసుల్లో సంపాదించారో చెప్పలేము. అన్నట్లు సుప్రసిద్ధ హాలీవుడ్ నటీమణి ఎలిజబెత్‌టేలర్ ఏడుగురు భర్తలను ఎనిమిదిసార్లు పెళ్లి చేసుకుంది. ఆవిడకిదేం పోయిన కాలం అనుకోవచ్చు. అసలు విషయం గురకేనట. ఆమె గురకను భరించలేక భర్తలు విసిగివేసారి పోయారని కొందరు చెవులు కొరుకుతారు. ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపూ ఉండదన్నట్లు గురక ఉన్నా గురితప్పకుండా కాపురాలకు ఎలాంటి ముప్పులేకుండా నెట్టుకొచ్చిన పెద్దలెందరో ఉన్నారు మరి. అసలు గురకంటూ లేకపోతే అనేక ఫార్మా కంపెనీలకు లాభాలు ఎలా వచ్చేవి? వైద్యులకు తగినంత ప్రాక్టీస్ ఉండేదా చెప్పండి! అరవై దాటిన మగవారిలో 70శాతం మంది, ఆడవారిలో 50-60శాతం మంది గురకపెడతారట. గురకకు చికిత్స చేస్తామని చెబుతాంగాని నిజానికి చాలా కష్టం అని వైద్యులు ప్రైవేటుగా చెబుతారు. ఎవరో ఎందుకు నేనే ఒకసారి చెవి సమస్యమీద డాక్టర్‌గారి వద్దకు వెళ్లి సందర్భోచితంగా గురక గురించి చెప్పాను. "మీరు గనుక నాకు చెప్పారు, నేనెవరికి చెప్పుకోవాలి. నాన్నా నీ గురక సౌండు కాస్త తగ్గించు నాన్నా అని మా వాడు టీవీ భాషలో చెప్పాడు" అంటూ పెద్దగా నవ్వేశారు.

భయంకరంగా గురక పెట్టేవాళ్లు ఎప్పుడో గురకతో హరీమనే అవకాశాలున్నాయంటారు. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ భారీ కాయం, గురకతోనే నిద్రలో 60ఏళ్ల వయస్సులో పోయాడంటారు. మరో అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ పగలంతా పొగతాగుతూ రాత్రంతా గురకపెట్టి మరీ నిద్రపోయేవాడట, విక్టోరియా రాణి కూడా వయస్సుతో పాటు శరీరాన్ని, గురకను పెంచినా ఎలాంటి ఢోకాలేకుండా బతికింది. బ్రిటీష్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ చేతిలో సిగార్‌తో నోట్లో గురకతో తొంభై ఏళ్లు ఎలా బతికాడమ్మా అని ఎవరైనా అనొచ్చు.

గురక పెట్టేవాళ్లను అంతగా తీసివేయకూడదంటూ జర్మనీలోని ఆల్‌ఫెల్డ్ అనే చిన్న పట్టణంలో డాక్టర్ జోసెఫ్ అలెగ్జాండర్ ఏకంగా ఒక గురక మ్యూజియాన్నే ఏర్పాటు చేశాడు. గురకలో రకాలతో పాటు 400 గురక నివారణ పద్ధతులు, పరికరాలు, మందులను అక్కడ ప్రదర్శనకు పెట్టారు. గురక భంగిమలు, కథలు, కవితలతో పాటు వందేళ్లనాటి గురక నిరోధ తొడుగుతో గురక మాన్పించేందుకు చిన్న చిన్న విద్యుత్ షాక్‌లు ఇచ్చేందుకు ఉపయోగించిన మొరటు పరికరాలు కూడా అక్కడ ఉంచారు. చరిత్రలో గురక ప్రముఖులైన రచయితలు, కవులు, కళాకారులు, సైంటిస్టులు, రాజకీయవేత్తల గురించిన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. నెపోలియన్ కేవలం మూడుగంటల పాటు మాత్రమే నిదురబోయి మిగతా సమయమంతా ఆలోచించిన కారణంగానే ప్రపంచవిజేత అయ్యాడన్నది గురక సిద్ధాంత వేత్తల వివరణ. అయితే ఆయన విమర్శకులు అందుకు అంగీకరించరు. నెపోలియన్ నిద్ర కంటే గురకే ఆయన విజయ రహస్యం అని కొందరంటారు. ఎందుకంటే ఆయనే కనుక నిదురపోయి ఉంటే ఆయన సైన్యాధికారులకు నిద్రలేక అలసిపోయి ఎప్పుడో తిరుగుముఖం పట్టి ఉండేవారని చెబుతారు. గురకే అనేక నూతనాంశాలను కనుగొనేందుకు దోహదం చేసిందని అది గనుక లేకపోయి ఉంటే ఒక సర్ ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొని ఉండేవాడుకాదని, థామస్ ఎడిసన్‌కే గనుక గురకలేక హాయిగా నిద్రపోయి ఉంటే విద్యుత్‌బల్బ్, ఫోన్ మొదలైన 1,093 వస్తువులను కనుగొని ఉండేవాడు కాదంటే ఏం చెప్పగలం?

షేక్స్పియర్, డికెన్స్, రాబర్ట్ బర్న్స్ నుంచి మంచి నాటకాలు, కథలు, కవితలు వచ్చినా, జాన్ స్టువర్ట్ మిల్ ఆర్థికాంశాలను అవపోసన పట్టినా, అమెరికా చరిత్రలో ఒక పెద్ద దౌత్యవేత్తగా పేరు తెచ్చుకున్న బెంజమిన్ ఫ్రాంక్లిన్ అందరూ గురకతో నిద్రపట్టని వారే. అంతెందుకు కొన్ని తరాల కుర్రాళ్లకు నిదురలేకుండా చేసిన హాలీఉడ్ నటి మార్లిన్ మన్రో అసలు రహస్యం గురకేనట. అయ్యో మాకు గురక సమస్య ఉందని ఇలాంటి ప్రముఖులంతా బాధపడి ఉంటే ఈ రోజు మనం వారి గురించి చెప్పుకొనే అవకాశం ఉండేదా? అందుకే గురక ఉన్నవారి గురించి నవ్వుకోనవసరం లేదు. ఏ గూట్లో ఏముందో ఎవరికి తెలుసు అన్నట్లు ఏ గురకలో ఏం పరమార్థముందో తెలియదు.

-సత్య



రేగు భళా!

అదొక పండు. పుల్లపుల్లగా, తియ్యతియ్యగా వుంటుంది. దాని పేరు వినగానే నోరూరిపోతుంది. దాన్ని చూస్తే చాలు నోట్లో లాలాజలం రెడీ అవుతుంది. ఇంతకీ అదేం పండో చెప్పకోండి?! య్యస్. మీ ఊహ సరైనదే. అది రేగుపండు. బండిమీద రేగుపళ్లు కనిపించాయంటే చాలు కొని తినాల్సిందే అనిపించక మానదు. సంక్రాంతి సందర్భంగా రేగుపళ్ల గురించిన గుప్పెడు కబుర్లు ఏరుకుందామా!

మీకు తెలీనిదేముంది చెప్పండి! సంక్రాంతి ఎప్పుడొస్తుందా? చంటోడికి/చంటిదానికి భోగిపళ్లు ఎప్పుడెప్పుడు పోద్దామా అని ఎదురుచూసేవాళ్లు ఎందరో! రేగుపండును భానుడికి చిహ్నంగా భావిస్తారు. అందుకే పిల్లలు భోగభాగ్యాలతో తులతూగాలని ఈ పండ్లను పోస్తారు. భోగినాడు పోస్తారు కాబట్టి వీటిని భోగిపండ్లు అంటారు.

రేగు పళ్లకు రకరకాల పేర్లున్నాయి. వీటిని జిజిఫస్ మారిటియానా, నార్కెలి కల్, బెర్, బోరీ, బోర్, బెరి అని వివిధ రకాలుగా వివిధ ప్రాంతాలలో పిలుస్తారు. ఈ చెట్లు త్వరగా పెరుగుతాయి. మూడు సంవత్సరాల్లోనే పండ్లనిస్తాయి.

ఎన్ని రకాలుగా తినొచ్చో...

ఎండిన పండ్లను స్నాక్స్‌లాగా, టీ తాగేప్పుడు తీసుకుంటారు. రేగిపళ్ల గుజ్జుతో టీ కూడా చేస్తారు. రేగు పళ్లతో జ్యూస్, వెనిగార్‌లను కూడా తయారుచేస్తారు. పశ్చిమ బెంగాల్‌లో, బంగ్లాదేశ్‌లో వీటితో పచ్చడి చేసుకుంటారు. చైనీయులు వీటితో వైన్‌ను కూడా తయారుచేస్తారు. వారు బెయ్‌జు అనే ద్రవంలో వాటిని నిలవ చేస్తారు. అలా అవి మూడు నాలుగు నెలల వరకు తాజాగా ఉంటాయి. రేగు పళ్లను ఎండబెట్టి వాటిలోని విత్తనాలు తీసి చింతకాయలు, ఎర్రని పచ్చిమిరపకాయలు, ఉప్పు, బెల్లం వేసి దంచుతారు. దీన్ని భోజనంతో కలిపి తింటారు. వీటితో వడియాలు కూడా చేస్తారు. రేగుపళ్లలో మంచి పోషకాలే కాక 'సి' విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. జామకాయ తరువాత ఎక్కువగా ఇందులోనే ఉంటుంది. మనదేశంలో ఎక్కువగా వీటిని నేరుగా తింటారు. వీటితో తాండ్ర కూడా చేసుకుంటారు. ఒంటెలు, మేకలు, ఇతర పశువులకు వీటి ఆకులు మంచి పోషకాహారం. ఇండోనేషియన్లు ఆకులతో కూర చేసుకుని తింటారట.

ఇదో నమ్మకం

ఈ పండ్ల తియ్యటి వాసనకు టీనేజ్ వాళ్లు ప్రేమలో పడతారట. అందుకే హిమాలయ, కారకోరమ్ ప్రాంతాలలోని పురుషులు స్త్రీలను ఆకర్షిండానికి పూత ఉన్న రేగు కొమ్మను టోపీల మీద పెట్టుకుంటారు. అంతేకాదు గర్భధారణ శక్తిని పెంచుతుందని చైనీయులు తమ పడకగదిలో రేగు పండ్లను, అక్రోటు కాయలను పెట్టుకుంటారు. భూటాన్‌లో సువాసన కోసం ఇళ్లలో సాహిత్య సంకలనం లాగా ఉపయోగిస్తారు. వాటిని ఇంట్లో పెట్టుకోవడం వల్ల కీటకాలు రావట.

రేగు సాగు

భారతదేశంలో 90 రకాలకు పైగా రేగుపళ్లను సాగుచేస్తున్నారు. ఒక చోట మొలిచిన రేగు పళ్ల చెట్టును ఇంకో చోట నాటితే అవి బతకవు. అందుకే ముందుగా ఎక్కడ వెయ్యదలచుకుంటే అక్కడ విత్తనాలను పెట్టాలి. మనదేశంలో ఈ

పోషకాలు

100 గ్రాముల తాజా రేగు పండ్లలో
కార్బో హైడ్రేట్లు - 17 గ్రా
చక్కెర - 5.4 నుండి 10.5 గ్రా
కొవ్వు పదార్థం - 0.07గ్రా
పీచు పదార్థం - 0.60గ్రా
ప్రోటీన్లు - 0.8 గ్రా
నీరు - 81.6 - 83. 0 గ్రా
తయామిన్(బి1 విటమిన్) - 0.02 నుండి 0.024 మిగ్రా(2శాతం)
రైబోఫ్లేవిన్(బి2) - 0.02 నుండి 0.038 మి.గ్రా(3శాతం)
నియాసిన్(బి3) - 0.7 నుండి 0.873 మి.గ్రా(5 శాతం)
కాల్షియం - 25.6 మి.గ్రా(3 శాతం)
ఇనుము - 0.76 నుండి 1.8 మిగ్రా
ఫాస్ఫరస్ - 26.8 మిగ్రా ఉంటాయి.



పండ్లు అక్టోబర్ ప్రారంభంలో, ఇతర ప్రాంతాలలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో వస్తాయి. మనదేశంలో సంవత్సరానికి ఒక్కో చెట్టు 5,000 నుండి 10,000 పండ్లను ఇస్తుంది. అంటు కట్టిన చెట్టైతే 30,000 వరకూ ఇస్తాయి. ప్రత్యేకంగా సాగు చేస్తే అధిక ఉత్పత్తిని సాధించవచ్చు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాలలో వీటి సాగు చేస్తారు.

వినాయకచవితి రోజు వక్రదంతుడికి రేగు ఆకులను సమర్పిస్తారు.

ఔషధకారి

రేగు పండు చూడ్డానికి చిన్నగా వుంటుందికానీ...ఎన్ని సంగతులున్నాయో. పచ్చిగా వున్నప్పుడు ఆకుపచ్చ రంగులో వున్నా...పక్వానికొచ్చాక రంగు మారుతుంది. పసుపు, ఆ పై ఎరుపు రంగుకు వస్తుంది. మన దేశంలో 90 రకాల రేగుపండ్లను పండిస్తున్నారు. ఇది మంచి ఔషధకారి.

♦చేతి నిండుగా రేగుపండ్లను ఒక అరలీటరు నీళ్లలో వేసి అవి సగం అయ్యే వరకు మరగనివ్వాలి. దానికి పంచదార కానీ తేనె గానీ కలిపి దానిని రోజూ పడుకోబోయే ముందు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. రక్తంలోకి గ్లుటామిక్ ఆమ్లం ఎక్కువగా విడుదలై మెదడు బాగా పనిచేయడానికి ఉపకరిస్తుంది.

♦రేగు పండ్లు తరచూ జ్వరం, జలుబు రాకుండా చేస్తాయి. శూలనొప్పి, డయేరియా, రక్త విరేచనాలను అరికట్టడానికి రేగి చెట్టు బెరడును ఉపయోగిస్తారు. బెరడు కషాయం మలబద్ధకానికి బాగా పనిచేస్తుంది. రేగు ఆకులను నూరి దాన్ని కురుపులు వంటి వాటి మీద రాసుకుంటే త్వరగా నయమవుతాయి.

♦రేగు పండు తీయని పండే కాదు మంచి హెర్బల్ మందుగా కూడా పనిచేస్తుంది.

♦ఇవి బరువు పెరగడంలో, కండరాలకు బలాన్నివ్వడంలో, శారీరక శక్తినివ్వడంలో ఎంతగానో ఉపయోగపడతాయి.

♦కాలేయం పనిని మరింత చురుకు చేయడానికి చైనీయులు ప్రత్యేకంగా రేగిపండ్లతో చేసినా టానిక్‌ను ఎంచుకుంటారు.

♦ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుందని జపనీయుల పరిశోధనలో తేలింది. ఇవి విరుగుడుగా, కఫోత్సారకంగా, మూత్ర స్రావకానికి ప్రేరకంగా ఉపయోగపడుతుంది.

♦అంతేకాదు బాధానివారిణి, క్యాన్సర్ వ్యతిరేకి, ఉపశమనకారి. ఇది రక్తాన్ని శుభ్రం చేస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. ఆకలి లేమి, రక్తహీనత, నీరసం, గొంతునొప్పి, శ్వాసనాళాల వాపు, విసుగు, హిస్టీరియా వంటి వాటి నివారణా మందులలో దీన్ని వాడతారు.

♦విత్తనాలు కూడా అనేక ఔషధగుణాలను కలిగి ఉంటాయి. నిద్రలేమి నివారణకు విత్తనాలను వాడతారు. అజీర్తిని అరికట్టడంలో దాని వేర్లను ఉపయోగిస్తారు.

♦వేర్లను పొడి చేసి పాత గాయాలకు పెడితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. ఆకులు జ్వరసంహారిగా ఉపయోగపడతాయి.

♦వెంట్రుకలు పెరగడానికి రేగుపండ్లు దోహదం చేస్తాయి. వేళ్లతో, బెరడుతో చేసిన రసం కీళ్లవాతానికి బాగా పనిచేస్తుంది.

♦అయితే ఎక్కువ తీసుకుంటే ప్రమాదం. పూలతో చేసిన కషాయం ఐ లోషన్‌గా ఉపయోగపడుతుంది.

♦ఇది 5 నుండి 10 మీటర్ల పొడవు వరకు పెరిగే ఆకురాల్చే చెట్టు లేదా పొద. మంచి పండ్లను ఇవ్వడానికి దీనికి ఎక్కువగా నీరు అవసరమైనా అధిక ఉష్ణోగ్రతను, అతి శీతలాన్ని కూడా తట్టుకుంటుంది. 7–13 డిగ్రీల సెల్సియస్‌ల నుండి 50 డిగ్రీల వరకు ఈ చెట్లు తట్టుకుంటాయి. చైనీయులు, కొరియన్లు వత్తిడి తగ్గించడానికి సాంప్రదాయక మందులలో వీటిని వాడతారు. చైనీయులు వీటిని 'హాంగ్ జావో లేదా హెయి జావో' అని అంటారు. ✶

భోగిపళ్లు

క్రైమ్ కథ

వాంటెడ్ కాలమ్

- యర్నాగుల సుధాకరరావు

ఆ రోజు డాక్టర్ గారి మరదలు వచ్చి ఫామ్‌హౌస్‌లో ఉంది. ఆమె లక్నోలో ఒక స్థలం అమ్మితే 40లక్షలు ముట్టింది. ఆమె వద్ద ఆ డబ్బుందని నా ఫ్రెండు సాయంతో చంపేశాను. తీరా వెతికితే ఆమె ఒంటిమీద నగలు తప్పితే ఏమీ దొరకలేదు. అంతకుముందే ఆమె భర్త ఆ డబ్బును తీసుకుపోయాడని తర్వాత తెలిసింది. చివరికి హత్య నా మీద వేసుకుని పోలీసులకు దొరక్కుండా పారిపోయి ఇక్కడికి వచ్చేశాను.

"అరే బేటా ఇంత రాత్రిమీద కూర్చుంటావు? నాలాంటి బేరాలే వస్తుంటాయి. నీవు నైట్‌డ్యూటీకే పరిమితమా? నేను మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా ఉంటే నాకు మాట్లాడాలనిపించదు. దగ్గర్లో మరో యస్.టి.డి. బూత్ లేదాయే, ఏమి చేయమంటావు?" పెద్దగా ఆవులిస్తూ బూత్‌లో కుర్రాడి పక్కనే కూర్చుని అడిగాడు జోసఫ్ .

"అదిగో అక్కడ నాలాంటి నైట్‌డ్యూటీగాడి టీ బంకు ఉంది. టీ తాగి వస్తాను. మాట్లాడుకోండి" అని ఫోన్ ముందుకు తోసి ఆ కుర్రాడు రమేష్ మెల్లగా అటువైపు నడుచుకుంటూ వెళ్లాడు.

జోసఫ్ గబగబ నెంబరు డయల్ చేసి రిసీవర్ చెవికి అదుముకున్నాడు. "రేయ్ నీకోసం పోలీసులు ఇక్కడ ఊరూ వాడా ఏకం చేస్తున్నారు. నువ్వు చేసిన మర్డర్ అందరి పీకల మీదకు వచ్చింది. నీ బంధువుల్ని, రాచిరంపాన పెట్టారు. నువ్వు ఈవైపుకు రావద్దు. నీ బంధువుల ఇళ్లకు ఫోను చేయకు. అన్ని ఫోన్లమీద పోలీస్ నిఘా ఉంది. అన్నట్టు పోలీసులు నీ ఫొటో నెట్‌లో పెట్టారంట. నువ్వు ఇక్కడికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా నెట్‌లో అక్కడ ఎవరైనా చూడగలరు. అయినా నెట్‌లో చూసి నిన్ను పసిగట్టడం కష్టమే అనుకో! జాగ్రత్తరా!"

"నేను తెచ్చిన డబ్బు అయిపోయింది. ఒక హోటల్‌లో పని దొరికింది. ఆ యజమాని ఆన్‌లైన్ నెంబర్ చెబుతాను. నోట్ చేసుకుని నాకెంతో కొంత పంపు. ఇదే ఆఖరి పేమెంట్. మరి అవసరం ఉండదు. నీలాంటి మిత్రుడు ఉన్నందుకు సంతోషంగా ఉంది. నీ మేలు ఈ జన్మలో మరువనురా!" అని చెప్పి ఫోను పెట్టేశాడు జోసఫ్.

రమేష్ టీ తాగి వచ్చాడు. "ఏమిటి సార్ మాట్లాడేశారా? మరో టీ తాగి రావాలా?" నవ్వుతూ అడిగాడు.

"గత నెలరోజులుగా ఈ బూత్‌లో మాట్లాడుతున్నాను. నావద్ద డబ్బులు అయిపోయాయి. నీకు రేపు రాత్రి ఈబాకీ ఇచ్చేస్తాను"

"మీరు ఉత్తరాదివారు. ఇక్కడికి ఏం పనిమీద వచ్చారు? బాగా చదువుకున్నోళ్లలా ఉన్నారు. మీ మాటలు ఎవరూ వినకుండా జాగ్రత్త పడుతున్నారు. కొంపదీసి ఇల్లాలిని వదిలి వచ్చేశారా?"

"చాలా బాగా చెప్పావు. నువ్వు గూఢచారి శాఖలో ఉండాల్సిన వాడవు. నా భార్య పరమ గయ్యాళిది. ఎందుకో ఆమెను భరించలేక వదిలి వచ్చేశాను. ఇక్కడే ఏదో ఒకటి పని చేసుకుంటాను. నిద్రవస్తోంది. రేపు కలుద్దాం" చెప్పి వెనుదిరిగాడు.

జోసఫ్ చీకటిలో కలిసిపోయే వరకు రమేష్ రెప్పవాల్చకుండా చూశాడు. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అప్పుడే పోలీసు పెట్రోలింగ్ వ్యాన్ వచ్చింది. "రేయ్ కేడీనాకొడుకులెవరైనా వస్తే చెప్పమని చెప్పాను. ఇంతవరకు నీవద్దకు మంచి ఎదవలే వచ్చిపోతున్నారా?" యస్.ఐ చేతిలో లాఠీని బల్ల మీద కొట్టి అడిగాడు.

"అనుమానం వస్తే కదా సార్, చెప్పమన్నారు. నిజంగా నాకు అలాంటి వాడెవడూ కన్పించలేదు"

ఆ యస్.ఐ ఫోన్ రిసీవర్ ఎత్తి రీడయల్ నొక్కాడు. అటునుంచి ఎంగేజ్ శబ్దం వచ్చింది. కాలర్‌లో నెంబర్ చూసి "ఇంత రాత్రిమీద ఎవడ్రా లక్నో ఫోన్ చేశాడు" కోడ్ను ఇలాచూస్తే అలా చెప్పగలను అన్నట్టుగా ఫోజు కొట్టాడు యస్.ఐ. ఆశ్చర్యపోవడం రమేష్ వంతైంది.

"గయ్యాళి పెళ్లాన్ని వదిలి వచ్చేసిన కేసు సార్"

ఆ మాటకు పకపకమని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు యస్.ఐ. రమేష్ జోసఫ్ గురించి ఆలోచించుకుంటూ రీడయల్‌లో నెంబరును పదేపదే చూశాడు. ఆ తరువాత ఒకరిద్దరు రావడంతో వారి పనిలో పడి చివరకు తెల్లవారు జామున సిస్టమ్‌లో ఇంటర్‌నెట్ ఓపెన్ చేశాడు. లక్నో పోలీసుల గురించి ఆరా తీశాడు. అలా కెలుకుతూ వాంటెడ్‌కాలమ్ చూశాడు. అందులో ఫొటోలు చాలా ఉన్నాయి. వాటిని క్లోజప్‌లో చూశాడు. ఒక్కసారి గుండె ఝల్లుమంది. ఒక ఫొటో పక్కనే ఉన్న స్క్రిప్ప్ చదివాడు. జోసఫ్ ఒక కాంపౌండర్. డాక్టర్ భార్య చెల్లెలు చుట్టపు చూపుకు వస్తే ఫామ్‌హౌస్‌లో డబ్బుకోసం చంపేశాడు. తీరా చంపాక ఆమె వద్ద అతడికి ఏమీ దొరకలేదు. నాలుక కరుచుకుని పారిపోయాడు. అతడి ఆచూకి తెలిపినవారికి లక్ష రూపాయలు ప్రకటించారు పోలీసులు. రమేష్ వెంటనే ఈమెయిల్‌లో ఒక మేటర్ పంపాడు. "రేపు నా ఆన్‌లైన్ ఎకౌంటులో సగం ఎమౌంటు వేస్తే నేను హంతకుడి వివరాలు పూర్తిస్థాయిలో ఇవ్వగలను"

ఆ మరుసటి రోజు నైట్‌డ్యూటీ దిగాక మధ్యాహ్నం వరకు నిద్రపోయి తిన్నగా బ్యాంకుకు వెళ్లి తన ఎకౌంటు చూసుకున్నాడు. తన ఎకౌంటులో పాతికవేలు జమైంది. వెంటనే విత్‌డ్రా చేయాలని అనుకున్నాడు. కానీ ఏవో పోలీస్ ఆంక్షలు ఉండే ఉంటాయి అనుకుని ఆగిపోయాడు. తిన్నగా నెట్‌లో తన ఈమెయిల్‌లోంచి హంతకుడి వివరాలు ఇచ్చాడు. ఆ మరుసటి రోజు సాయంత్రానికి లక్నో పోలీసులు ఫ్లయిట్‌లో బెంగుళూర్‌లో దిగిపోయారు.

యస్.టి.డి బూత్‌లో నైట్‌డ్యూటీ చేస్తున్న రమేష్ వద్దకు జోసఫ్ అర్ధరాత్రివేళ వచ్చి ఎప్పటిలానే టీ తాగమని పంపాడు. ఆ వెంటనే జోసఫ్ ఫోనులో మాట్లాడుతుండగా లక్నో పోలీసులు చుట్టుముట్టారు.

జోసఫ్ చేష్టలుడిగిపోయాడు. లోకల్ పోలీసు ఠాణాకు తీసుకుపోయారు. అక్కడ తాను ఏ పరిస్థితిలో హత్యచేసింది వివరించాడు. ఆ రోజు డాక్టర్ గారి మరదలు వచ్చి ఫామ్‌హౌస్‌లో ఉంది. ఆమె లక్నోలో ఒక స్థలం అమ్మితే 40లక్షలు ముట్టింది. ఆమె వద్ద ఆ డబ్బుందని నా ఫ్రెండు సాయంతో చంపేశాను. తీరా వెతికితే ఆమె ఒంటిమీద నగలు తప్పితే ఏమీ దొరకలేదు. అంతకుముందే ఆమె భర్త ఆ డబ్బును తీసుకుపోయాడని తర్వాత తెలిసింది. చివరికి హత్య నా మీద వేసుకుని పోలీసులకు దొరక్కుండా పారిపోయి ఇక్కడికి వచ్చేశాను. నేను ఇక్కడ ఉన్నట్టు ఎలా తెలిసింది? నా ఫ్రెండు ఫోనుకు నేను అర్ధరాత్రి మాత్రమే చేస్తున్నాను"

"ఆ ఫ్రెండు కూడా ఉదయమే లక్నోలో అరెస్టు అయ్యాడు. మీ గురించి క్లూ అందించింది నువ్వు నిత్యం ఫోన్‌చేసే యస్.టి.డి బూత్ రమేష్. నీ ఫోన్ నెంబరును రీడయల్ ద్వారా తెలుసుకుని మాకు అందించాడు" లక్నో పోలీస్ అధికారి చెప్పాడు.

రమేష్ వైపు కోపంగా చూశాడు జోసఫ్. "నేను నీతో మంచిగా ఉన్నాను. కానీ, నన్ను వంచించావు" అని మాత్రం అనగలిగాడు.

"జోసఫ్! ఇప్పుడున్న ఉగ్రవాదం వల్ల కొత్తవాళ్లను అనుమానించాల్సిన పరిస్థితి ఉంది. అందుకే నీవు ఫోన్‌చేసే లక్నో కోడ్ చూశాక నెట్‌లో లక్నో పోలీసులు ఇచ్చే వాంటెడ్‌కాలమ్ చూశాను. నీ ఫొటో చూశాక నిన్ను పట్టించాలనుకున్నాను. నీ లాంటివాడు చట్టంనుంచి తప్పించుకోకూడదు" అనిచెప్పి రమేష్ లక్నో పోలీసుల పక్కకు చేరాడు.

★

వికాసం

చింటు వాళ్ల ఇంట్లో రోజూ ఇదే గోల. చిన్నప్పుడు చాలా బొద్దుగా ఉండేవాడని ఆ పేరు పెట్టుకుంది లలిత. కానీ వాడు పెరిగే కొద్దీ తిండి సరిగా తినక బక్కగా అయిపోయాడు. 'ఒక్క ముద్ద తినమ్మా, మా మంచి బాబు కదూ' అని బతిమాలి పెడుతుంది. ఒక్కోసారి ఏదో ధ్యాసలో పడి తింటాడు. ఒక్కోసారేమో 'నాకా కూర వద్దు. పప్పెందుకు చెయ్యలేదు' అంటాడు. పప్పు చేసిన రోజు 'పప్పొద్దు. కూరెందుకు చెయ్యలేదు' అంటాడు. అలా ఏదో ఒక పేచీ పెట్టి భోజనం మానేస్తాడు. కానీ చింటూ అన్నం తినని రోజు లలిత మనసు ప్రశాంతంగా ఉండదు. 'అయ్యో నా బంగారు కొండ! ఒక్క ముద్దన్నా తినకుండా పడుకున్నాడు' అని దిగులు పడుతుంది. స్కూలుకు వెళ్లిరాగానే అక్కడ నొప్పి ఇక్కడ నొప్పి అంటాడు. ఏదైనా కొంచెం నలతగా ఉన్నా అసలు తట్టుకోలేడు. త్వరగా డీలా పడిపోతాడు. లలిత ఈ విషయం గురించి ఆలోచించని రోజుండదు.

♦♦♦

లక్కీ వాళ్ల అమ్మదీ ఇదే పరిస్థితి. 'నా చిట్టి తల్లి కదా! ఒక్క ముద్ద తినమ్మా. చిన్ని పొట్ట ఏడుస్తుంది' అని ఎంత మాయ చేసినా ఒక్క మెతుకూ గొంతులోకి జారనీయదు. 'ఆకలి కావట్లేదమ్మా, కూర నచ్చలేదమ్మా' వంటి మాటలు చెప్పి తిండికి ఎగనామం పెడుతుంది.

♦♦♦

ఇది ఒక్క చింటు, లక్కీ వాళ్ల ఇంట్లోనే కాదు, దాదాపు అందరి ఇళ్లలోనూ ఈ పరిస్థితి తరచూ తటస్థపడుతూనేవుంటుంది. అయితే తిండి దగ్గర పేచీ పెట్టే బుజ్జాయిలను అలా వదిలేయకూడదు. ఎందుకంటే ఎదిగేపిల్లలకు పోషకాహారం చాలా అవసరం. ఇది వారి విజ్ఞానానికి ఎంతగానో దోహదపడుతుంది. ఆ విషయం చిన్నారులకు వివరంగా తెలియజేయాలి. పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో వారికి ఎదురయ్యే సమస్యల గురించి తెలియజెప్పాలి. పిల్లలు తీసుకునే ఆహారం నుంచి వారి శరీరానికి కావలసిన క్యాలరీలు ఉత్పత్తి అవుతాయి. కాకపోతే దానివల్ల వారికి తగిన పోషణ ఉండదు.

2 నుండి 3 సంవత్సరాల వయసున్న పిల్లల్లో 66 శాతం మంది, 4 నుండి 6 సంవత్సరాల వయసువారు 87 శాతం మంది, 7 నుండి 10 సంవత్సరాల వారు 73 శాతం మంది తిండి దగ్గర పేచీ పెడతారని అంతర్జాతీయ అధ్యయనం తెలిపింది.

♦80 శాతం మంది భారతీయ తల్లులు తమ పిల్లలు సరిగా తినరు అని

♦70 శాతం మంది తల్లులు తమ పిల్లలు బలహీనంగా ఉన్నారనీ, త్వరగా అలసిపోతారనీ

♦57 శాతం మంది తల్లులు తమ పిల్లలు బరువు పెరగడం లేదనీ

♦42 శాతం మంది తల్లులు తమ పిల్లలు తరచుగా జబ్బు పడుతుంటారనీ అనుకుంటారని ఓ పరిశోధనలో తేలింది.

అయితే ఎక్కువ మంది పిల్లల్లో ఇది ఒక అలవాటుగా ఉంటుంది. ఇలా సరిగా తినకపోవడం వల్ల జరిగే పరిణామాలేమిటో తల్లి తప్పని సరిగా తెలుసుకోవాలి.

సరిగా తినకపోవడం వల్ల పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల తగ్గుతుంది. తరచుగా అనారోగ్యానికి గురి కావడం, అధిక బరువు సమస్యలు తలెత్తుతాయి. ఒక్కోసారి సామాజిక, మానసిక సమస్యలు ఎదురవుతాయి.

పిల్లలకు బలవంతంగా తినిపించడం మంచి పద్ధతి కాదు. అలాగని వారికి తినిపించడం అంత సులువేం కాదు. ఒక్కోసారి తల్లులకు విసుగొచ్చి ఇంక ఆ పూటకు వదిలేస్తారు కూడా. వివిధ కోణాలలో ఆలోచించి ఏదో విధంగా వారు తినేట్టు చేయాలి.

♦ఓపికగా నిరుత్సాహ వాతావరణాన్ని తొలగించాలి.

♦మనోద్వేగానికి గురికాకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించాలి.

♦భోజన సమయంలో అన్యమనస్కతను తొలగించేందుకు వారికి ఇష్టమైన కబుర్లు, కథలు చెప్పాలి.

♦అదేవిధంగా భోజన సమయానికి వీడియోగేమ్స్, ఇతర ఆట వస్తువులు కనపడకుండా చేయాలి.

♦భోజనానికి ముందు బిస్కెట్లు, ఇతర చిరుతిండ్లను ఇవ్వకూడదు.

♦వారి వయసుకు తగిన ఆహారం పెడుతూ నెమ్మదిగా కొత్త కొత్త ఆహారాన్ని అలవాటుచేయాలి.

♦ఇల్లంతా జల్లుతారు అనుకోకుండా వారంతట వారే తినేట్టు చేయాలి.

♦ఎప్పుడూ ఒకేరకమైన ఆహారం కాకుండా రకరకాలుగా ఇస్తుండాలి.

ఇలా చేయడం పెద్దలకు కొద్దిగా సమస్యే అయినా ప్రియాతిప్రియమైన చిన్నారులకోసం తప్పదుగా.

- సంధ్య

అదా! ఒద్దు!!

2 నుండి 10 సంవత్సరాల మధ్య పిల్లలు టిఫిన్ దగ్గర, భోజనం దగ్గర పేచీ పెడుతుంటారు. 'ఆ టిఫినా?, ఈ కూరా? నాకిష్టం లేదు' అని ఏదో సాకు చెప్పి మారాం చేస్తారు. తినడం మానేస్తారు. తల్లులకు ఇదొక పెద్ద సమస్యగా ఉంటుంది. మరి అలాంటి పేచీకోరు పిల్లలతో నాలుగు ముద్దలు తినిపించడం ఎలాగో చూద్దామా!



చూద్దామా



భారతదేశంలో అతి సుందరమైన నగరాల్లో రాజస్థాన్‌లోని పింక్ సిటీ, నీలాకాశాన్ని తలపించే బ్లూ సిటీ పర్యాటకులను అబ్బురపరుస్తాయి. అవే జైపూర్, జోధ్‌పూర్ పట్టణాలు. అక్కడి కట్టడాలూ, కోటలూ, వారి వస్త్రధారణ వింతగా ఉంటాయి. రాజపుత్రుల కళాపోషణకు, శౌర్యపరాక్రమాలకు నిదర్శనాల్లాంటి రాజప్రాసాదాలు, నాటి రాజుల పెయింటింగులు, ఇతర కళాత్మక వస్తువులు సందర్శకులను కళ్లు తిప్పుకోనీయవు.

ఎడారిలో... రంగుల నగరాలు

భారతదేశంలో ప్రణాళిక ప్రకారం నిర్మించిన మొట్టమొదటి నగరం పింక్ సిటీ. ఈ నగర వీధులు ఎప్పుడు చూసినా పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. నగరంలోని నాటి భవనాలు... రాజపుత్రుల రాజసానికి, దర్పణానికి అద్దం పట్టేవిగా ఉంటాయి. వారి కళాభిరుచి, శిల్పుల నైపుణ్యం విభ్రమాన్ని కలిగిస్తాయి. హవా మహల్, సిటీ ప్యాలెస్, అంబర్ కోట భారత దేశ నిర్మాణసౌందర్యానికి ఉదాహరణగా ఉన్నాయి. పతంగుల పండుగ, ఏనుగుల పండుగ ఇంకా ఇతర పండుగలెన్నో ఇక్కడివారు జరుపుకుంటారు. ఇక్కడి స్త్రీలు కూడా కత్తిపట్టి యుద్ధం చేసేవారు. జైపూర్‌లో ఆచారాలు, సాంప్రదాయాలు, నాగరికత మెండుగా ఉంటాయి.

రాజస్థానీ అందాలు

ముక్కుపుడకలూ, చేతినిండా గాజులు, మెడలో ఆభరణాలు, సాంప్రదాయక రాజస్థానీ వస్త్రాలతో మహిళలను, వివిధ రకాల, రంగుల వస్త్రాలతో తలపాగాలు ధరించిన పురుషులను చూస్తుంటే సంప్రదాయానికి ఎంత విలువనిస్తారో తెలుస్తుంది. అలాగని ఆధునికతనేం చిన్నచూపు చూడలేదు వారు. జైపూర్‌లో ఎక్కడ చూసినా హెరిటేజ్ హోటళ్లు... పర్యాటకుల బసకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటాయి. పార్కులు, ఉద్యానవనాలతో నగరమంతా పచ్చగా ఉంటుంది. ఒంటెలతో నడిచే బళ్లు ఇప్పటికీ అక్కడ ఉన్నాయి. వాటిమీద అలా ఒకసారి తిరిగి రావడం భలే మజాగా ఉంటుంది! ఆధునికత పెరిగిన తరువాత ఇవి నామోషీ అయ్యాయిగానీ అప్పట్లో ఎక్కడికి వెళ్లాలన్నా అవే దిక్కు.

గులాబీ నగరం

1727లో మహారాజా సవాయి జై సింగ్ -2 ఈ నగర నిర్మాణాన్ని ప్రారంభించారు. దీని నిర్మాణానికి దాదాపు 4 సంవత్సరాలు పట్టింది. ఆయన ఈ నగరాన్ని 1699 నుండి 1744 వరకు పరిపాలించాడు. మొదట్లో అంబర్ ఆయన రాజ్యానికి రాజధానిగా ఉండేది. అంబర్ నగరం జైపూర్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంబర్‌లో జనాభా పెరిగిపోయి నీటి వనరులకు కొరత ఏర్పడడంతో ఆయన ఈ నగరాన్ని ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించారు. దీనికోసం భవన నిర్మాణానికి సంబంధించిన అనేక రకాల గ్రంథాలను ఆయన పరిశీలించాడు. చివరకు అంబర్ కోశాగారంలో పనిచేసిన విద్యాధర భట్టాచార్య మార్గదర్శకాన ఈ నగరాన్ని నిర్మించారు. తరువాత ఆయనను ముఖ్య వాస్తుశిల్పిగా నియమించారు. ఆయన బెంగాల్‌కు చెందిన పండితుడు. ఈ నగరం మొత్తం 9 విభాగాలుగా ఉంటుంది. రెండు విభాగాలలో రాజభవనాలు, ప్యాలెస్‌లు ఉంటాయి. మిగిలిన ఏడు విభాగాలను ప్రజలకు కేటాయించారు. ఏడు కోటగోడలను కట్టుదిట్టమైన ద్వారాలతో నిర్మించారు. అప్పట్లో ఈ నిర్మాణ శైలి దేశంలోనే అత్యాధునికమైంది. 1853లో వేల్స్ రాజు జైపూర్‌ను సందర్శించడానికి రాబోయేముందు నగరాన్ని అలంకరించాలన్న ఉద్దేశంతో సవాయి రామ్ సింగ్ భవనాలన్నిటికీ గులాబీ రంగును వేయించాడు. అప్పటి నుంచి ఈ నగరానికి పింక్ సిటీ పేరు పెట్టారు. ఇది రాజస్థాన్‌కు తూర్పు దిక్కున ఉంది.

సిటీ ప్యాలెస్

సిటీ ప్యాలెస్ ఒక విచిత్రమైన కట్టడం. దీన్ని ఒక శత్రువులకు దారి తెలియకుండా నిర్మించారు. మొఘులుల, రాజపుత్రుల భవన నిర్మాణ శైలి ఈ కోటలో కనిపిస్తుంది. దీని ప్రవేశ ద్వారం వద్ద స్వాగతం పలుకుతున్నట్టుండే రెండు పెద్ద ఏనుగుల శిల్పాలు చాలా అందంగా ఉంటాయి. కోట ముఖ ద్వారాలు సందర్శకులను అక్కడి నుండి కదలనీయవు. వాటిమీద చెక్కిన రకరకాల పూలు, బొమ్మలలో నాటి శిల్పుల నైపుణ్యం తొణికిసలాడుతుంది. ఈ ప్యాలెస్‌లో ఏడంతస్తులుంటాయి. ఎంతో విశాలమైన గదులు, అద్భుతమైన చిత్రకళ జాలువారే పెద్దపెద్ద తలుపులు, కిటికీలు అందులో ఉంటాయి. అంతేకాదు ఇందులో ఒక మ్యూజియం కూడా ఉంటుంది. ఇది అపురూపమైన సంపదకు ఆలవాలం. మొఘులుల, జైపూర్ రాజుల కాలం నాటి చిత్రాలను, మధ్యయుగం నాటి పర్షియా, ఆఫ్ఘన్ కార్పెట్లను, రాజకుటుంబీకులు ధరించిన వస్త్రాలను ఈ మ్యూజియంలో చూడొచ్చు. ఈ కోటలో అతి ముఖ్యమైనది రాజకుటుంబీకులుండే చంద్ర మహల్. ఈ మహల్ గోడలపై మహారాజా ప్రతాప్

జీవిత ముఖ్య ఘట్టాలను పెయింటింగులతో ఎంతో అందంగా చిత్రీకరించారు. యుద్ధసమయంలో ఆయన ఉపయోగించిన ఈటె, డాలు వంటి ఆయుధాలను కూడా మనమీ పెయింటింగులలో చూడొచ్చు. రాణా ప్రతాప్ గుర్రం 'చేతక్' ధరించిన కవచం, ఎత్తైన మార్బుల్ సింహాసనం, అద్దాల డిజైన్లు, ఇంకా ఇతర పెయింటింగులు ఇక్కడ ఉన్నాయి.

[illegible]

ఎంతో అందంగా, ముచ్చటగా ఉంటుంది. ఈ కోట జైపూర్ పట్టణ పర్యాటక ప్రదేశాలకు ప్రధాన కేంద్రం. కోటకు కిలోమీటరు దూరంలో జస్వంత్ తాడా అని ఒక ప్రాంతముంటుంది. ఇక్కడ రాజుల సమాధులుంటాయి. వీటిని పల్చటి చలువరాయితో నిర్మించారు. వాటిలో మొదటి రాణా సమాధి చాలా పెద్దగా ఉంటుంది. ఎండా కాలంలో ఇక్కడ ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉండడం వల్ల ఈ నగరాన్ని సన్ సిటీ అని కూడా అంటారు.

ప్యాలెస్ ఆఫ్ విండ్స్

హవా మహల్‌నే ప్యాలెస్ ఆఫ్ విండ్స్ అని అంటారు. ఇది సిటీ ప్యాలెస్‌కు పశ్చిమాన ఉంటుంది. దీన్ని కూడా గులాబీ రంగుతో నిర్మించారు. దీనిలో ఐదంతస్తులుంటాయి. ఉదయం సూర్యకాంతి పడుతున్న సమయంలో గులాబీ రంగులో మెరిసిపోయే ఈ భవనం అందం చూడ్డానికి రెండు కళ్లు చాలవేమో అనిపిస్తుంది. సందర్శకులు ఆ అందాన్ని తమ కెమెరాల్లో బంధించడానికి క్యూలో నిల్చుని ఉంటారు. దీనిని 1799లో నిర్మించారు. దీనికి 593 కిటికీలు ఉంటాయి. వీధుల్లో జరిగే ఉత్సవాలను రాణీవాసపు స్త్రీలు చూసేందుకు ప్రత్యేకంగా దీన్ని నిర్మించారు. విశాలమైన, కళాత్మకత ఉట్టిపడే ఆర్చీలతో బాల్కనీలు... ఈ భవనం చూడముచ్చటగా ఉంటుంది.

జైపూర్ నగరానికి ఈశాన్య దిక్కున 3 కిలోమీటర్ల దూరంలో నహర్ ఘర్ కోట ఉంది. ఈ కోటను రెండో జైసింగ్ తన రాణుల కోసం 1734లో నిర్మించారు. దీనిలో రాణుల గదులు వర్తులాకారంలో ఉంటాయి. ఇంకా జైఘర్, జంతర్ మంతర్ కోటలు, జల్ మహల్, రామ్‌బాఘ్ ప్యాలెస్ సందర్శకులను అబ్బురపరుస్తాయి.

సూర్య దేవాలయం

కోటలూ, రాజప్రాసాదాలేకాక ఆలయాలు, ప్రకృతి సుందరమైన దృశ్యాలు ఎన్నో జైపూర్‌లో ఉన్నాయి. పర్యాటకులను కట్టిపడేస్తాయి. జైపూర్‌కు దక్షిణంగా ఉన్న కొండపై గాల్టా ఉంది. ఇది వాలుగా ఉండే కొండ ప్రాంతం. సుమారు 250 ఏళ్ల నాటి దేవాలయాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సూర్యదేవాలయం గురించి. ఆ ఆలయ ప్రాంగణం, అక్కడి శిల్పాలు, అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. దీనికి సమీపంలో రెండు రాతి ట్యాంకులుంటాయి. పైనున్న ట్యాంకులోని నీళ్లను సందర్శకులు, అక్కడి ప్రజలు తాగుతారు. కిందనున్న ట్యాంకులోవి కోతులు తాగుతాయి. మరి ఈ రెండు రాతి ట్యాంకులలోకి నీరు మాత్రం ప్రకృతి సిద్ధంగానే వస్తాయి. ఇంకా బిర్లా టెంపుల్(లక్ష్మీనారాయణ మందిర్), గోవింద్ దేవ్ జై ఆలయం, జైనుల ఆలయం, దూంగ్రి ఆలయం, మోతి, గలతాజి పర్యాటకులను అలరిస్తాయి.

ఏడవ అద్భుత పర్యాటక ప్రదేశం

ఈ మధ్యే జరిగిన అంతర్జాతీయ సర్వేలో ఆసియలో సందర్శించదగిన ప్రదేశాలలో జైపూర్‌కు ఏడవ స్థానం లభించింది. భారతదేశంలోని 12 ముఖ్యమైన నగరాలలో ఇది మూడవ స్థానంలో ఉంది.

నీలి నగరం

జైపూర్‌లో అన్నీ గులాబీ రంగు భవనాలున్నట్లే జోధ్‌పూర్‌లో ఇళ్లన్నీ నీలి రంగులో ఉంటాయి. అందుకే దీన్ని బ్లూ సిటీ అంటారు. ఈ నగరాన్ని చూస్తుంటే నీలాకాశం నేలమీదకు వచ్చిందేమిటా అనిపిస్తుంది. ఈ నగరంలో 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉమెద్ భవన్ ప్యాలెస్ చాలా బాగుంటుంది. దీన్ని ఉమెద్ సింగ్ 1929లో నిర్మించాడు. దీని నిర్మాణానికి సుమారు 14 ఏళ్లు పట్టింది. దీని నిర్మాణానికి ఒక గొప్ప కారణముంది. అప్పట్లో జోధ్‌పూర్‌లో కరవు సంభవించి ప్రజలకు పనులు లేకుండా పోయాయి. ఆ సమయంలో వారికి ఉపాధి కల్పించడానికి దీని నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 15 ఏళ్ల పాటు సుమారు 3000 మందికి ఉపాధి కల్పించిందీ కోట. ఈ కోటలో మొత్తం 347 పడక గదులున్నాయి. దీని పైకప్పు సుమారు 105 అడుగుల ఎత్తులో ఉంది. సూర్యకాంతి గమనానికి అనుగుణంగా మారుతూ సూర్యకాంతి లోపలికి ప్రవేశించే విధమైన గ్లాసును దీనికి ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని మూడు విభాగాలుగా చేశారు. ఒక విభాగంలో రాజు ఉంటారు. మరో విభాగాన్ని మ్యూజియంగా మార్చారు. దీనిలో రాజులు వేసిన చిత్రాలు, పెయింటింగులు, రాణుల ఆభరణాలు, వస్త్రాలు, బొమ్మల రూపంలో రామాయణం వంటివి ఉంటాయి. మూడో విభాగంలో హోటల్ ఉంది. 1975లో రాజభరణాలు రద్దయిన తరువాత ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనడానికి ఈ విభాగాన్ని హోటళ్లకు లీజుకిచ్చారు.

షాపింగు

జాతి రాళ్లు, బంగారు ఆభరణాలకు పెట్టింది పేరు జైపూర్. ఎనామెల్ పెయింటింగుతో ఆభరణాలు ఎంతో బాగుంటాయి. అందమైన పాలరాతి బొమ్మలు, ఊలుతో చేసిన కార్పెట్లు, కాటన్ రగ్గులు ఎంతగానో ఆకట్టుకుంటాయి. నెహ్రూ బజార్, బాపూ బజార్‌లలో దొరికే వస్త్రాలు, పెర్ఫ్యూమ్స్, ఒంటె చర్మంతో చేసిన చెప్పులు ఇక్కడ మనం కొనుక్కోవచ్చు. సాంప్రదాయక రాజస్థానీ దుస్తులకు త్రిపోలియా బజార్ సుప్రసిద్ధం.

ఎలా వెళ్లాలి

అతి సుందరమైన జైపూర్‌కు వెళ్లాలంటే 'ప్యాలెస్ ఆన్ వీల్స్' ఎక్కాల్సిందే. ఆ రైలులో ప్రయాణం మరో అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది. ప్రతి బుధవారం ఈ రైలు ఢిల్లీ నుండి బయలుదేరుతుంది. అక్కడి నుండి మొదటి స్టాప్ జైపూరే. ఢిల్లీ నుండి జైపూర్‌కు 260 కిలోమీటర్లు. ఈ ప్రయాణం ఢిల్లీ, ఆగ్రా, జైపూర్‌లను కలుపుతూ సాగుతుంది. ఈ రైలు సెప్టెంబరు నుండి ఏప్రిల్ నెలల్లోనే ఉంటుంది. ★



త్రీడీ ప్రపంచం



ఒకపక్క ఎల్జీ, మైక్రోసాఫ్ట్, సోనీలు ఏదో ఒక రకంగా 3డి రంగంలో తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తుంటే, మరో పక్క ఆపిల్ కంపెనీ ఎప్పటిలాగే తనదైన విశిష్ట ఉత్పత్తిగా ఒక ప్రత్యేకమైన 3డి డిస్ప్లేని రూపొందించే ప్రణాళికతో ఈ మధ్యే ఒక పేటెంటును నమోదు చేసింది. బహుశా కంప్యూటర్ మౌస్, కీ బోర్డు లేకుండా కేవలం డిస్ప్లేతోనే కథ నడిపించ వచ్చేమో! పేటెంట్ ప్రకారం 'వినియోగదారుని దృష్టికోణం బట్టి డిస్ప్లే ప్రదర్శింపబడుతుంది' అని కంప్యూటర్ వాడే మనిషి ఉన్న స్థలాన్ని బట్టి డిస్ప్లేలో మార్పు జరిగి, స్క్రీన్ మీద ఉన్న బొమ్మ నిజంగా ఉన్నట్టు భ్రమ కలుగుతుంది. ఆపిల్ ఎటువంటి మాయాజాలాన్ని చూపుతుందో వేచి ఉండాలి.

గత సంవత్సరం సాంకేతిక పరిజ్ఞానంలో అనూహ్య అభివృద్ధి చవి చూసింది. ఈ ఏడాది ఆ పరిజ్ఞానం ముందుకు సాగనుంది. పోయిన ఏడాది 'టచ్' టెక్నాలజీ మిగతా అన్నిటినీ మరుగున పడేసింది. సెల్‌ఫోన్ల నుండి టెలివిజన్ల వరకు టచ్ టెక్నాలజీ మానవుల జీవితాలను సుగమం చేసింది. ముందున్న రోజులలో 'టచ్'తో పాటు 3డి టెక్నాలజీ ముందుకు దూసుకుపోనుంది. గత ఏడాది చివరిలో వచ్చిన 'అవతార్' సినిమా అందుకు బీజం వేసింది. తెరపై జరిగే సంఘటనలను కేవలం ప్రేక్షకుల్లా చూసే విధానానికి, ఆ సంఘటనలలో పాలుపంచుకునే అనుభూతిని పొందడానికి చాలా తేడా ఉంది. ఆ విధంగా సినిమా మన ముందు జరుగుతున్నట్టు కాకుండా మనమే అందులో ఉన్నట్టు అనిపించేలా చేసేది తాజా 3డి టెక్నాలజీ.

నిజానికి ఎన్నో సంవత్సరాల క్రితమే ఈ 3డి టెక్నాలజీ సినిమాలలో వచ్చేసినా, అంతగా ప్రాచుర్యం పొందలేదు. కారణాలు ఏమైనా కాని, ఈ టెక్నాలజీ అటు ప్రజలకు, ఇటు శాస్త్రవేత్తలకు పెద్ద ప్రోత్సాహం ఇచ్చినట్టు కనిపించలేదు. కానీ ఇప్పటి టెక్నాలజీ అభివృద్ధి అనూహ్య ఎత్తులకు ఎదిగింది. ముందుగా టీవీలు ఈ సాంకేతికతను వాడుకోవడానికి సిద్ధపడుతున్నాయి. ఎల్జీ సంస్థ ఈ ఏడాదిలో దాదాపు అయిదు లక్షల 3డి టీవీలను అమ్మే ప్రణాళిక వేసుకుంది. అలాగే లాప్‌టాప్‌లు, గేమ్స్ కన్సోల్‌లు కూడా సిద్ధమవుతున్నాయి. ఏసర్ కంపెనీ ఇప్పటికే మొట్టమొదటి త్రీ డైమెన్షన్ లాప్‌టాప్‌ను విడుదల చేసింది కూడా. చాలా మంది నిపుణులు ఏసర్‌ని ఒక జిమ్మిక్‌గా కొట్టి పారేస్తున్నారు గానీ, మొత్తానికి ఇది ఒక విప్లవానికి ప్రారంభం అని భావించే వాళ్లూ ఉన్నారు.

ఏసర్ లాప్‌టాప్ స్క్రీన్‌పై ఒక పోలరైజింగ్ ఫిల్టర్‌ని అమర్చింది. ఆ ఫిల్టర్ చిత్రాలను విడి పుంజాలుగా విడగొడుతుంది. లాప్‌టాప్‌తో పాటు ఉచితంగా వచ్చే పోలరైజింగ్ కళ్లజోళ్ల ద్వారా చూస్తే బొమ్మలు 3డిలో కనిపిస్తాయి. ఈ విషయం మీద మైక్రోసాఫ్ట్ కూడా ఆసక్తి చూపుతోంది.

అయితే 3డి భవిష్యత్తు ఎక్కువగా గేమింగ్ రంగంలో ఉందని అంటున్నారు. సోని, మైక్రోసాఫ్ట్ కంపెనీలు తమ తమ గేమింగ్ ప్రాజెక్టులను రూపొందించుకుంటున్నాయి. ఇటువంటి టెక్నాలజీని సంపూర్తిగా ఆనందించాలంటే డెబ్బెయ్యవ దశకంలోని అట్ట అద్దాల కంటే మెరుగైన కళ్లజోళ్లు కూడా అవసరమవుతాయి. తాజా సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన 3డి అద్దాలు అద్భుతాలను మరింత అద్భుతంగా ఆవిష్కరిస్తాయి. ఈ ఏడాది చివరికల్లా అటువంటి అద్దాలు అందుబాటులోకి వస్తాయని అనుకుంటున్నారు.

ఒకపక్క ఎల్జీ, మైక్రోసాఫ్ట్, సోనీలు ఏదో ఒక రకంగా 3డి రంగంలో తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తుంటే, మరో పక్క ఆపిల్ కంపెనీ ఎప్పటిలాగే తనదైన విశిష్ట ఉత్పత్తిగా ఒక ప్రత్యేకమైన 3డి డిస్ప్లేని రూపొందించే ప్రణాళికతో ఈ మధ్యే ఒక పేటెంటును నమోదు చేసింది. బహుశా కంప్యూటర్ మౌస్, కీ బోర్డు లేకుండా కేవలం డిస్ప్లేతోనే కథ నడిపించ వచ్చేమో! పేటెంట్ ప్రకారం 'వినియోగదారుని దృష్టికోణం బట్టి డిస్ప్లే ప్రదర్శింపబడుతుంది' అని కంప్యూటర్ వాడే మనిషి ఉన్న స్థలాన్ని బట్టి డిస్ప్లేలో మార్పు జరిగి, స్క్రీన్ మీద ఉన్న బొమ్మ నిజంగా ఉన్నట్టు భ్రమ కలుగుతుంది. ఆపిల్ ఎటువంటి మాయాజాలాన్ని చూపుతుందో వేచి ఉండాలి.

ఇదే క్రమంలో రాబోయే రెండు మూడు సంవత్సరాలలో పది పదిహేను సినిమాలు ఈ టెక్నాలజీలో రూపొందనున్నాయి. మనదేశంలోనూ ఈ ధోరణి ప్రారంభం కానుంది. కానీ టీవీలలో, కంప్యూటర్‌లలో 3డి మహత్యం మాత్రం మన జీవితాలతో ఆటలాడుకోనుంది.

- కాకర్లమూడి విజయ్

ఏడు అడుగుల కుక్క

"మీరెప్పుడైనా ఏడడుగుల శునకరాజాన్ని చూశారా!"

"లేదే.."

"చూడలేదా! అయితే వేస్టండీ బాబూ. పరమ వేస్టు"

"ఇది మరీ బావుంది? అసలు అంత పొడవాటి కుక్క ఈ నేల మీద వుంటేకదా చూడ్డానికి"

"అంటే మీ ఉద్దేశం అంత పొడుగు కుక్క లేదనా!"

"మరంతేకదా"

"అయితే మీరు కుక్క తోక తొక్కినట్టే. ఇదిగో ఇంత పొడవున కారులో కూర్చుని ఫోజిచ్చిన కుక్క ఏడడుగుల పొడవుంటుంది"

"ని...జ...మే! ఏంటిది? కుక్కా! చిన్న సైజు గుర్రంలా వుందే! ఇంతకీ దీన్ని పెంచిన యజమాని ఎవరో?"

"ప్రపంచం మొత్తంమీద పొడవైన కుక్క ఇదేనేమో! పేరు జెయింటు జార్జ్. వయసు 4 సంవత్సరాలు. ఇంతకూ దీని ఎత్తు ఎంతంటే ముక్కు నుంచి తోక వరకూ 7 అడుగుల 3 అంగుళాలు వుంటుంది. దీని యజమాని డేవిడ్!"

"ఔనా! దానిగురించి మరిన్ని విశేషాలు చెప్పేయండి. వినిపెడతాం"

"మీరడగాలేగానీ... చెప్పేయమూ.... ఈ శునకరాజం ఎంచక్కా తన పొడవాటి మంచంమీద పడుకుంటుంది. అది తమ ఓనరు కారు వెనుక సీటును పూర్తిగా ఆక్రమించేస్తుంది. అసలు ఇది ఇంత పొడవవుతుందని డేవిడ్ ఎప్పుడూ అనుకోలేదట. దీన్ని 7 వారాల పసికూనగా వున్నప్పటి నుంచి పెంచుకుంటున్నారు. తమాషా ఏంటంటే ఈ జాతి కుక్కల గురించి అతనికి 45 సంవత్సరాల నుంచి తెలుసు. అయితే ఇంత పొడవాటి కుక్కను అతను ఇప్పటి వరకూ చూడలేదట"



"అవునా! మరైతే జార్జి పేరును గిన్నిస్ బుక్‌లో చేర్చొచ్చుకదా..."

"ప్రపంచ పొడవాటి కుక్కగా గిన్నిస్ రికార్డు సృష్టించిన కుక్క గిబ్సన్ గత ఆగస్టులో క్యాన్సర్‌తో చనిపోయింది. దాంతో జార్జ్ ఓనరు డేవిడ్ ఆ పనిలోనే వున్నాడు"

"ఔ...నా..."

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకు కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: గౌస్ సంధాని
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ఎ.పి.ఆర్ స్కూల్
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, కలంస్నేహం చేయడం
చిరునామా: గౌస్ సంధాని
సన్నాఫ్ : ముజావర్ కబీరుద్దీన్,కొమ్మూర్,
కాకుమాను, గుంటూరు.

పేరు: సుమేరా ఫిర్దోస్
చదువు: 6వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: సరస్వతి హైస్కూల్
లక్ష్యం: సైంటిస్ట్ కావడం
హాబీలు: పేపర్ చదవటం, కొత్త ప్రదేశాలు చూడడం
చిరునామా: సుమేరా ఫిర్దోస్
డాటరాఫ్ : హసన్ షరీఫ్
ఆలేరు, నల్గొండ.

పేరు: ఎస్.నాగార్జున రాజు
చదువు: 6వ తరగతి
వయస్సు: 12 సం॥
స్కూలు: అంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్
లక్ష్యం : క్రికెటర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: ఎస్.నాగార్జున రాజు
అంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, నయానగర్,
అనంతగిరి రోడ్, కోదాడ, నల్లగొండ.

పేరు: ఇంజమామ్ షరీఫ్
చదువు: 5వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: సరస్వతీ హైస్కూల్
లక్ష్యం: క్రికెటర్
హాబీలు: పాటలు పాడడం, క్యారమ్స్ ఆడడం
చిరునామా: ఇంజమామ్ షరీఫ్
సన్నాఫ్ : హసన్ షరీఫ్
ఆలేరు, నల్గొండ.

పేరు: సిహెచ్. అరవింద్
చదువు: 6వ తరగతి
వయస్సు: 11సం॥
స్కూలు: డి పాల్ స్కూల్
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు: టీవీ చూడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: సిహెచ్. అరవింద్
సన్నాఫ్ : ఆనందరావు, 30-82-1/85,
తిరుమల నగర్, వడ్లపూడి,
విశాఖపట్నం.

పేరు: ఎస్. మల్లికార్జున్
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: అంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: ఎస్. మల్లికార్జున్
అంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, నయానగర్,
అనంతగిరి రోడ్, కోదాడ,
నల్లగొండ.